
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
ఆదివారం 17 నవంబరు 2024



జనంపై బొమ్మల భారం..

వైసీపీ పాలనలో జరిగిన పాపాల ఫలితం.. జనాలు ఇప్పటికీ అనుభవిస్తూనే ఉన్నారు. జగన్ పేరు, బొమ్మలు వేసుకుని ప్రచారం చేసుకున్న పాపం ప్రస్తుతం జనం నెత్తిన పడుతోంది. తనకు ఏమాత్రం సంబంధం లేని ప్రజల భూముల్లో వైఎస్సార్ జగనన్న భూరక్ష-2020 పేరుతో పాతిన సర్వేరాళ్లపై జగన్ మోహన్‌రెడ్డి తన పేరు, బొమ్మ ముద్రించుకున్నారు. అయితే ఈ నిర్ణయాన్ని అప్పట్లో ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించినా జగన్ అవేమీ పట్టించుకోలేదు. ఫలితం జిల్లా ప్రజల మీద రూ.కోట్ల భారం పడింది. ఇప్పుడు ఆ పేర్లు, బొమ్మలు తొలగించేందుకు మళ్లీ కోట్లాది రూపాయలు వెచ్చించనున్నారు. దీంతో జగనన్న బొమ్మ పడినా.. బొమ్మ తీసేసినా జనం జేబులకు చిల్లు పడుతోంది.



బి.కొత్తకోటలో సర్వే రాళ్లపై జగన్ పేరును తొలగిస్తున్న కార్మికులు



జగన్ ఫొటో, పేరు ఉన్న సర్వే రాళ్లు

- ప్రజలు వద్దన్నా.. సర్వే రాళ్లపై జగన్ బొమ్మలు, పేర్లు
- రాయి పాతేందుకు రూ.150 తొలగించేందుకు రూ.60..
- తొలగించే పనిలో సర్వే శాఖ బిజీబిజీ
- నాటి ప్రభుత్వ పాపం.. ప్రజలకు శాపం...

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం వైఎస్సార్ జగనన్న భూరక్ష-2020 కార్యక్రమం ద్వారా భూముల రీసర్వే మొదలు పెట్టింది. ఇందులో భాగంగా జిల్లాలోని 318 రెవెన్యూ గ్రామాల్లో ఇప్పటికి 174 గ్రామాల్లో సర్వే పూర్తయింది. ఇంకా 119 గ్రామాలు మిగిలి ఉన్నాయి. సర్వే పూర్తయిన గ్రామాల్లో మైనింగ్ శాఖ పంపిణీ చేసిన సర్వే రాళ్ల పాతారు. జిల్లాకు 1,87,238 రాళ్లను మైనింగ్ శాఖ సరఫరా చేసింది. ఇప్పటి వరకు జిల్లాలో 1,60,494 సర్వే రాళ్లను పాతారు. ఆ సర్వే రాళ్లపై అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేరు, బొమ్మలు ముద్రించారు. అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయానికి ప్రజలు తీవ్రంగా అభ్యంతరం చెప్పారు. అయినా జగన్ ఎవరి మాట వినలేదు. తన బొమ్మ, పేరు ఉంటే తాను అధికారంలో నుంచి దిగిపోయినా. సంవత్సరాల పాటు ప్రజలు తనను రోజూ చూడాలని, తనకు ప్రచారం లభించాలని ఆ రాళ్లనే పాతారు. ఒక్కోరాయి పాతడానికి.. రూ.150 ఖర్చు అయింది. ఈ లెక్కన జిల్లాలో సుమారు రూ.2,40,74,100 కోట్లు ఖర్చు అయింది.

తొలగించేందుకు రూ.60

కూటమి ప్రభుత్వం ఏర్పడగానే ప్రజల అభ్యంతరాలను ప్రభుత్వం గౌరవించింది. ఆ ముద్రల్ని తొలగించేందుకు శ్రీకారం చుట్టింది. ఆ రాళ్లపై ఇప్పుడు జగన్ బొమ్మలు, పేర్లు తొలగించేందుకు అధికారులు ప్రయత్నం చేశారు. సాండ్ పేపర్‌ను ఉపయోగించారు. దీనివల్ల పెద్దగా ప్రయోజనం కనిపించలేదని అధికారులు గుర్తించారు. పైగా అలా చేయడంతో ఒక్కో రాయికి రూ.40, కూలి రూ.20 చొప్పున మొత్తం రూ.60 ఖర్చు అవుతుందని తేలింది. దీని వల్ల రూ.60 లెక్కన 96,29,640 ఖర్చు అవుతుంది. దీంతో ఆ పద్ధతి వద్దని అధికారులు నిర్ణయం తీసుకున్నారు. యంత్రం సాయంతో అయితే..రూ. 15 మాత్రమే వ్యయం అవుతుంది కాబట్టి యంత్రాల సాయంతో ప్రస్తుతం ఆ బొమ్మలు, పేర్లను తొలగించే పనిలో సర్వేశాఖ బిజీబిజీగా ఉంది. దీనివల్ల రూ.24,07,410 ఖర్చు అవుతుంది. కాబట్టి జిల్లా సర్వే శాఖ అధికారులు ప్రస్తుతం ఈ పనిలో బిజీగా ఉన్నారు. స్వయంగా కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఈ పనులను పర్యవేక్షిస్తున్నారు. సాధ్యమైనంత త్వరగా ఈ పని పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

బ్రిటీష్ వాళ్లకు లేని ఆలోచన జగన్‌కు..

బ్రిటీష్ ప్రభుత్వంలో 1905లో (సుమారు) భూముల రీసర్వే జరిగింది. అప్పట్లో సర్వే పూర్తి చేసిన అధికారులు రాళ్లను పాతారు. ఏళ్ల తరబడి మన దేశాన్ని పాలించిన బ్రిటీష్ పాలకుల బొమ్మలు, పేర్లు ఆ రాళ్లపై ఎక్కడా లేవు. కేవలం సర్వే చేసిన తర్వాత సూచికలు, గుర్తులు మాత్రమే ఉన్నాయి. అయితే కేవలం ఐదు సంవత్సరాల పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలను హింసించి, వేధించిన జగనన్న మాత్రం రీసర్వే పేరుతో భూముల్లో తన పేరు, బొమ్మ వేసుకోవడం విశేషం. దీనిపైన ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు.



పుల్లంపేట ఎంపీడీవో కార్యాలయంలో సర్వేరాళ్లపై జగనన్న భూరక్ష అక్షరాలను తీసేయిస్తున్న కలెక్టర్ శ్రీధర్ (ఫైల్)

రిజర్వాయర్ల అభివృద్ధి పనులకు రూ.156.60 కోట్లు మంజూరు చేయండి

- చెరువుల మరమ్మతులు, తాగునీటి అవసరాలు తీర్చాలి
- జల వనరుల శాఖ మంత్రిని కోరిన మండిపల్లి



జలవనరుల శాఖ మంత్రికి వినతిపత్రం అందిస్తున్న మంత్రి మండిపల్లి

రాయచోటిటౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రిజర్వాయర్లు, చెరువుల మరమ్మతుల పనులకు రూ.156.60 కోట్లు కేటాయించాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కోరారు. విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో మంత్రిని కలిసిన మండిపల్లి ఈ మేరకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాయచోటి నియోజకవర్గంలోని చిన్నమండెం మండలంలో గల మండిపల్లి నాగిరెడ్డి శ్రీనివాసపురం రిజర్వాయర్, పీలేరు నియోజకవర్గంలోని అడవిపల్లి రిజర్వాయర్‌లకు సాగునీరు అందించే హెచ్ఎన్ఎస్ఎస్ మెయిన్ కెనాల్ బ్యాలెన్స్ పనులను పూర్తి చేసేందుకు నిధులు కేటాయించాలని కోరారు. రాయచోటి నియోజకవర్గ పరిధిలోని రాయచోటి, సంబేపల్లె, గాలివీడు, లక్కిరెడ్డిపల్లె, రామాపురం, చిన్నమండెం మండలాల్లో ఉన్న చెరువుల మరమ్మతు పనులు, తాగునీటి సమస్య తదితర ఇరిగేషన్ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని మంత్రిని కోరారు. రాబోయే రోజుల్లో నీటి నిల్వలు పెంపొందిస్తూ జిల్లాలో శాశ్వత నీటి సమస్య పరిష్కారానికి తమ వంతు సహాయ సహకారాలు ఇవ్వాలని జల వనరులశాఖ మంత్రిని కోరారు.

మణికంఠగిరి ప్రదక్షిణలో కిక్కిరిసిన భక్తులు



రాయచోటిలో మణికంఠగిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

రాయచోటిటౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని సుద్దలవాండ్లపల్లె రోడ్డులో వెలిసిన మణికంఠగిరిపై వెలిసిన హరిహర సుతుడు అయ్యప్పస్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం రాత్రి జరిగిన గిరి ప్రదక్షిణకు భక్తులు పోటెత్తారు. ఈ గిరి ప్రదక్షిణకు పెద్ద ఎత్తున అయ్యప్ప మాలధారులు, అయ్యప్ప భక్తులు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు. భక్తిశ్రద్ధలతో మేళతాళాలతో బాణాసంచాతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప సేవా సొసైటీ అధ్యక్షుడు బసిరెడ్డి స్వామి మాట్లాడుతూ అయ్యప్పస్వామి ఎంతో మహిమ గల దేవుడని, కోరికలు తీర్చగలిగే మహిమలు గల స్వామి ఇక్కడ కొలువై ఉన్నారన్నారు. ప్రతి ఒక్కరూ అయ్యప్పను దర్శించి స్వామి వారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు. ఇలాంటి కార్యక్రమాలను రాబోయే రోజుల్లో మరింత వైభవంగా జరిపేందుకు కృషి చేస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలియజేశారు.

చలిమామిడి కొండపై చిరుతపులి

- భయభ్రాంతుల్లో ప్రజలు



చలిమామిడికొండపై ఉన్న చిరుతపులి

నిమ్మనపల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): చలిమామిడికొండపై చిరుతపులి కనిపించడంతో స్థానిక ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. మండలంలోని రెడ్డివారిపల్లి పంచాయతీ మోడల్ స్కూల్ వెనుక భాగంలో ఉన్న చలిమామిడికొండపై శనివారం ఉదయం 11 గంటలకు చిరుతపులి కనిపించింది. దీంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. వారం రోజుల క్రితం చల్లావారిపల్లి, పారేసువారిపల్లిల్లో ఆవును, మేకను చిరుతపులి చంపిన విషయం విదితమే. తిరిగి శనివారం కనిపించడంతో సమీప గ్రామస్తులు కొండ సమీపంలోకి గొర్రెలు, మేకలు, పాడిఆవులు తోలేందుకు సాహసించలేదు. కొన్ని రోజులుగా చిరుతపులి సంచరిస్తున్నా అటవీ శాఖాధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇది ఇలాగే కొనసాగితే ఎవరో ఒకరు చిరుతకు బలి కావాల్సి వస్తుందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటవీ శాఖ సిబ్బంది త్వరితగతిన చిరుతను బంధించాలని ప్రజలు కోరుతున్నారు.

పీలేరు పూర్వ ఈవోలు సస్పెన్షన్

- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్
- పంచాయతీ నిధుల దుర్వినియోగం

పీలేరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పీలేరు గ్రామ పంచాయతీకి గతంలో ఈవోలుగా పనిచేసిన ఇద్దరు అధికారులను సస్పెండ్ చేస్తూ ఈనెల 13న రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ఉత్తర్వుల మేరకు వైసీపీ హయాంలో పీలేరు ఈవోలుగా పనిచేసి, ప్రస్తుతం చిత్తూరు జిల్లా సదుం మండల ఈవోపీఆర్‌డీగా పనిచేస్తున్న జీఎల్ఆర్‌వీ ప్రసాద్, అన్నమయ్య జిల్లా కేవీపల్లె మండలం ఈవోపీఆర్‌డీగా పనిచేస్తున్న ఎస్‌ఏ గఫూర్‌లను సస్పెండ్ చేస్తున్నట్లు ఆయా జిల్లాల కలెక్టర్లు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి ఉత్తర్వులు అందే వరకు వారిద్దరూ విధులకు దూరంగా ఉండాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీంతో పీలేరు గ్రామ పంచాయతీ నిధుల దుర్వినియోగ అంశం, దానిపై పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి చేసిన పోరాటం అంశం మరోమారు వెలుగులోకి వచ్చింది.

రూ.97.61 లక్షలు దుర్వినియోగం

జీఎల్ఆర్‌వీ ప్రసాద్, ఎస్‌ఏ గఫూర్‌లు రూ.97,61,199 దుర్వినియోగానికి పాల్పడినట్లు అధికారుల విచారణలో నిర్ధారణ అయినట్లు కమిషనర్ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈవోగా పనిచేసిన సమయంలో అప్పటి సర్పంచ్ హబీబ్‌బాషాతో కుమ్మక్కై జీఎల్ఆర్‌వీ ప్రసాద్ రూ.43,25,379లు, ఇన్‌చార్జి సర్పంచ్ జీనత్ షఫీతో కుమ్మక్కై ఎస్‌ఏ గఫూర్ రూ.54,35,820 దుర్వినియోగం చేసినట్లు అన్నమయ్య జిల్లా కలెక్టర్ అందించిన విచారణ నివేదికలో తేలిందని కమిషనర్ స్పష్టం చేశారు.

కలెక్టర్ నివేదిక మేరకు వారిద్దరినీ సస్పెండ్ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇదే వ్యవహారంలో గతంలో పీలేరు ఈవోగా పనిచేసిన కేఆర్ ప్రసాద్‌ను (వాల్మీకిపురం గ్రామ పంచాయతీ జూనియర్ అసిస్టెంటు) జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేశారు. దీంతో పీలేరు పంచాయతీ నిధుల దుర్వినియోగం వ్యవహారంలో ఇప్పటికి ముగ్గురు అధికారులు బలి అయ్యారు. పీలేరు పంచాయతీ నిధులు దుర్వినియోగం అంశంలో పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి పోరాటం ఫలించింది. నిధుల దుర్వినియోగం గురించి ఆయన ప్రతిపక్షంలో ఉన్నప్పటి నుంచి పోరాడుతూనే ఉన్నారు. తాజాగా కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే అధికారులతో విచారణ చేయించడంతో ఆయన ఆరోపణ లు నిజమని తేలడంతో అధికారులను సస్పెండ్ చేశారు.

పెద్దదర్గాలో గంధ పరిమళం

- ప్రారంభమైన ఉరుసు మహోత్సవాలు

కడప కల్చరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కడప అమీన్‌పీర్ (పెద్ద) దర్గా ఉరుసు మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. అక్కడ ఇసుక వేస్తే రాలనంత జనం. అంతటా ఆధ్యాత్మిక సుగంధం.. అందరి మనసుల నిండా భక్తి పారవశ్యం నెలకొంది. దర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా మహమ్మద్ మహమ్మదుల్ ఆరీఫుల్లా హుసేని చిష్టివుల్ ఖాద్రి సాహెబ్ పర్యవేక్షణలో నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలు శనివారం వైభవంగా మొదలయ్యాయి. ఈ సందర్భంగా రాత్రి 8 గంటలకు మలంగ్‌షాను పీఠాధిపతి స్వయంగా దీక్షలో కూర్చోబెట్టారు. రాత్రి పీఠాధిపతి గంధం కలశాన్ని ఫకీర్ల మేళతాళాల మధ్య ఊరేగింపుగా దర్గాలోని గురువుల మజార్ల వద్దకు తీసుకొచ్చారు. పీఠాధిపతి స్వయంగా గురువు మజార్ వద్ద ప్రార్థనలు చేసి గంధం సమర్పించి ఫతేహా చేశారు. ప్రముఖ సినీ సంగీత దర్శకులు ఏఆర్ రెహ్మాన్ ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఖవ్వాలి కచేరి భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. పలువురు ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు గంధం ఉత్సవంలో పాల్గొన్నారు. కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి గంధోత్సవంలో పాల్గొని చాదర్ సమర్పించారు. కాగా.. పెద్దదర్గా ఉరుసు మహోత్సవాలను పురస్కరించుకుని సోమవారం సాయంత్రం 4-30 గంటలకు సినిమా హీరో రామ్‌చరణ్ కడపకు రానున్నారని మెగా ఫ్యాన్స్ జిల్లా అధ్యక్షుడు తాజ్ షరీఫ్ వెల్లడించారు. పెద్దదర్గా మహోత్సవాలలో జరుపతలపెట్టిన 80వ నేషనల్ ముషాయిరా గజల్ ఈవెంట్‌ను రామ్‌చరణ్ ప్రారంభిస్తారన్నారు.



ప్రార్థనలు చేస్తున్న పీఠాధిపతి ఆరిఫుల్లా హుసేని, చిత్రంలో ఏఆర్ రెహ్మాన్

ప్రాణాలు తీస్తున్న ఒత్తిడి



- ఆత్మహత్యకు పాల్పడుతున్న వైనం
- ప్రతిరోజూ మానసికవైద్యుని వద్దకు పదుల సంఖ్యలో విద్యార్థులు

6

అలుపెరగని అయ్యవారు

- నిత్యం బడి నామస్మరణే
- ఎక్కడ పనిచేసినా తనదైన ముద్ర
- తన జీతంతో వలంటీర్ల ఏర్పాటు
- సొంతడబ్బు, దాతల సహకారంతో సౌకర్యాలు

6

25 నుంచి 108 సిబ్బంది సమ్మె

- అధికారులకు సమ్మె నోటీసు ఇచ్చిన 108 సిబ్బంది

6

భూబకాసురులు

- చెరువును చెరబట్టారు
- కుచించుకుపోయిన లింగప్ప చెరువు
- లింగప్ప చెరువులో ఆక్రమణల జోరు



చెరువులో మట్టి తోలి చదును చేసిన దృశ్యం

సంబేపల్లె, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అతి పెద్దదైన లింగప్ప చెరువు ఆక్రమణదారుల చేతుల్లో చిక్కిపోయింది. వర్షపు నీటి నిలువలతో భూగర్భజలాలు పెరిగి రైతులకు సాగునీటికి ఉపయోగపడేలా వీటిని ఏర్పాటు చేస్తే భూబకాసురుల స్వార్థానికి చెరువు కుచించుకుపోయింది. నీటి నిలువలు దేవుడెరుగు ఉన్న చెరువే ఉనికి కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. వీటిని సంరక్షించాల్సిన ఇరిగేషన్ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు చేసినా ఆక్రమణలను గుర్తించడం తప్ప చెరువు భూములను ఆక్రమణ నుంచి స్వాధీనం చేసుకున్న పరిస్థితి కనిపించడం లేదని ఆయకట్టు రైతులు చెబుతున్నారు. మండలంలోని నారాయణరెడ్డిపల్లె గ్రామం ముద్దినేనివాండ్లపల్లె వద్ద గల లింగప్ప చెరువు విస్తీర్ణం 20.38 ఎకరాలు అయితే ప్రస్తుతం 10 ఎకరాలు కూడా కనిపించడం లేదు. రెవెన్యూ అధికారులకు చెరువు ఆక్రమణపై ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోయారు. ఊరికి ఆనుకుని ఉండడంతో చెరువు చుట్టుపక్కల ఉన్న వ్యక్తులు ఈ భూమి ఆక్రమించుకున్నారు. చెరువు ఆక్రమణలపై పట్టించుకోవాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. ఇరిగేషన్ అధికారులు తమకేమీ పట్టనట్లు చూసీ చూడనట్లు వదిలేశారు. దీంతో రోజురోజుకు ఆక్రమణలు పెరిగిపోయి చెరువు చిన్నదైపోయింది. వర్షపు నీరు వచ్చినా తక్కువ నీరు నిలబడే అవకాశం ఉంది. దీంతో చెరువు ఆయకట్టు రైతులు తమ పొలాలను బీళ్లుగా పెట్టుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

ఆక్రమణలను పరిశీలిస్తాం..

చెరువు ఆక్రమణలపై పరిశీలించి చర్యలు తీసుకుంటాం. సంబంధిత గ్రామ వీఆర్‌వోకు వెంటనే సమాచారం అందించి పరిశీలిస్తాము. ఆక్రమణలు జరిగి ఉంటే గుర్తించి స్థలం స్వాధీనం చెరువు స్థలాన్ని స్వాధీనం చేసుకుంటాం.

- వెంకటేశులు, తహసీల్దార్

ఫిర్యాదుపై గతంలో విచారణ

లింగప్ప చెరువు ఆక్రమణలపై రెండు నెలల క్రితం చెరువు ఆయకట్టు రైతు ఆదిరెడ్డి ఫిర్యాదు చేయడంతో అప్పట్లో ఆక్రమణలపై మండల ఆర్ఐ స్రవంతి ఆక్రమణలను పరిశీలించి ఎక్స్‌కవేటర్‌లతో జరుగుతున్న పనులు నిలిపివేయాలని తెలియజేశారు. ఆక్రమణలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధికారి వెళ్లిన వెంటనే యధావిధిగా ఆక్రమణలు కొనసాగించారు.

ఆక్రమణదారులపై చర్యలు..

రెవెన్యూ అధికారులు ఆక్రమణలు గుర్తిస్తే చర్యలు వెంటనే చర్యలు తీసుకుంటాం. రికార్డు ఆధారంగా ఎంత విస్తీర్ణం అన్న విషయం రెవెన్యూ అధికారులే గుర్తించాలి. వాస్తవంగా ఆక్రమణకు గురై ఉంటే చర్యలు తీసుకుంటాం.

- శివానాయక్, జేఈ, ఇరిగేషన్



చెరువును చదును చేస్తున్న ఎక్స్‌కవేటర్లు (ఫైల్)



చెరువును చదును చేసి పొలంగా తయారు చేసిన దృశ్యం

రైల్వేకోడూరులో భారీ వర్షం

- లోతట్టు ప్రాంతాలు జలమయం



రైల్వేకోడూరు ప్రధాన దారిలో వర్షం నీరు

రైల్వేకోడూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం భారీ వర్షం కురిసింది. దీంతో పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రంగనాయకులపేట, కొత్తబజారు, పాతబజారు, రైల్వేస్టేషన్ రూటు, ప్రధానరహదారి, గాంధీనగర్ తదితర రోడ్లు జలమయమయ్యాయి. పలు ఇళ్లలోకి వర్షం నీరు చేరింది. వర్షపునీటిని తోడుకుంటూ ప్రజలు ఇబ్బందులు పడ్డారు. నాలుగు రోజులుగా అప్పుడప్పుడూ వర్షం పడుతూనే ఉంది. దీంతో బొప్పాయి, అరటి కోతలకు ఇబ్బందిగా మారిందని రైతులు వాపోతున్నారు. భవన నిర్మాణ కార్మికులు పనులు చేసుకోవడానికి ఇక్కట్లు పడ్డారు.



రైల్వేకోడూరు పాతబజారులో చేరిన వర్షం నీరు



గాంధీనగర్ రోడ్డు జలమయం

అలుపెరగని అయ్యవారు

- నిత్యం బడినామస్మరణే
- ఎక్కడ పనిచేసినా తనదైన ముద్ర
- పిట్టిగుంటలో విద్యార్థుల సంఖ్య 3 నుంచి 103కు చేర్చిన ఘనత
- తన జీతంతో వలంటీర్ల ఏర్పాటు
- సొంతడబ్బు, దాతల సహకారంతో సౌకర్యాలు

కాశినాయన, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగం అంటేనే ఇలా వచ్చామా.. అలా వెళ్లామా అనేతీరులో పనిచేసేవారే ఎక్కువ. అందుకు భిన్నంగా విధులు నిర్వహిస్తూ పలువురి మన్ననలను పొందుతున్న అలుపెరగని అయ్యవారు గానుగపెంట రమణారెడ్డి. కాశినాయన మండలం చెన్నారెడ్డిపల్లెలోని దిగువ మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన రమణారెడ్డి విద్యాభ్యాసం అంతా సర్కారు బడుల్లోనే సాగింది. 1998లో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. మొదట కవలకుంట్ల ప్రాథమిక పాఠశాలలో బాధ్యతలు స్వీకరించి బదిలీ అయ్యేనాటికి ఆ పాఠశాలను ఉన్నత పాఠశాల స్థాయికి తీర్చిదిద్దారు.

మూతబడే పాఠశాలల ఎంపిక

ప్రభుత్వ బదిలీల్లో భాగంగా మంచి పాఠశాలల్లో పోస్టింగ్ వచ్చే అవకాశం ఉన్నా మూరుమూల పల్లెల్లో మూతబడే దశలో ఉన్న పాఠశాలనే ఎంపిక చేసుకోవడం రమణారెడ్డి ప్రత్యేకత. పాఠశాల పురోగతిలోకి రాకపోతే చెడ్డపేరు వస్తుందని తోటి మిత్రులు, సహచర ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు వారించినా మొండిగా ముందుకెళ్లి పాఠశాల స్థితిగతులను మార్చి తానేంటో నిరూపించుకుంటూ ముందుకు సాగుతున్నారు. ఉప్పలూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా చేరే నాటికి అక్కడ విద్యార్థుల సంఖ్య కేవలం 14 మంది. తనదైన రీతిలో విద్యార్థులకు ఉచితంగా పరీక్ష సామాగ్రి, నోట్‌పుస్తకాలు, అవసరమైన బోధనోపకరణాలు, దుస్తులు అందించడంతో



చెట్టుకింద పాఠాలు బోధిస్తున్న రమణారెడ్డి (ఫైల్)

పాటు నిత్యం విద్యార్థులకు అందుబాటులో ఉంటూ బోధనచేయడంతో అక్కడ విద్యార్థుల సంఖ్య 54కు చేరింది. దీంతో రమణారెడ్డికి ఉపాధ్యాయలోకంలో ప్రత్యేక గుర్తింపు వచ్చింది. అనంతరం 2017లో ప్రభుత్వ బదిలీల్లో మంచి పాయింట్లతో కోరుకున్న పాఠశాలలో పోస్టింగ్ లభించే అవకాశం ఉన్నప్పటికీ ముగ్గురు విద్యార్థులతో మూతబడే దశలో ఉన్న పిట్టిగుంట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఎంచుకున్నారు. గ్రామంలో కలియతిరిగారు. పోరుమామిళ్ల, కలసపాడు లాంటి పట్టణాల్లోని ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. సర్వం తానే బాధ్యత తీసుకుంటాను అంటూ వారికి నమ్మకం కలిగించారు. విద్యార్థుల సంఖ్యను 25కు పెంచారు. సొంత ఖర్చులతో ముగ్గురు వలంటీర్లను ఏర్పాటు చేసుకుని ఉదయం పాఠశాల సమయంకంటే ముందు స్టడీ అవర్స్ పెట్టారు. సెలవుదినాల్లో బడి నిర్వహించేవారు. వెనుకబడిన విద్యార్థులకు సాయంత్రం 6గంటల నుంచి 8గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహించారు. గణితం, సైన్సు, ఇంగ్లీషులో ప్రత్యేక శిక్షణ, వేసవి సెలవుల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించారు. కరోనా సమయంలో రాష్ట్రమంతటా పాఠశాలలు మూతబడినా పిట్టిగుంట ప్రాథమిక పాఠశాలలో రోజుకు ఒక తరగతి చొప్పున పిలిపించుకుని పాఠాలు బోధించారు. విద్యార్థుల్లో విద్యాసామర్థ్యాలు పెరిగాయి. మండలంలో ఏ పోటీ పరీక్షలు నిర్వహించినా రమణారెడ్డి పాఠశాలలో చదివే విద్యార్థులే ప్రథమస్థానంలో నిలిచేవారు. సొంత నిధులతో పాటు దాతల సహకారంతో కంప్యూటర్, టీవీ, లైబ్రరి, బోధనోపకరణాలు సమకూర్చారు. ప్రారంభంలో సరిపడిన గదులు లేకపోయినా చెట్టుకిందనే పాఠాలు బోధించేవారు. దాతల సహకారంతో ప్రత్యేక షెడ్డు ఏర్పాటు చేయించారు. పాఠశాలలో స్కూల్‌డేలు, జాతీయ పర్వదినాలు నిర్వహించేవారు. దీంతో విద్యార్థుల సంఖ్య క్రమంగా 103కు చేరింది. మీడియాలో సక్సెస్ కథనాలు అనేకం ప్రచురితమయ్యాయి. దీంతో రాష్ట్రమంతా పిట్టిగుంట ప్రాథమిక పాఠశాల వైపు చూసేలా చేశారు. దీన్ని ఒక కేస్‌స్టడీగా తీసుకుని రాష్ట్రస్థాయి కమిటీలు వచ్చి పరిశీలించి పోయాయి. ఇప్పటికీ ఈ కార్యక్రమాలన్నీ ఈ పాఠశాలలో కొనసాగుతున్నాయి.

ప్రాథమికోన్నత స్థాయికి పెంపు

ఒకే గదితో ఏకోపాధ్యాయ ప్రాథమిక పాఠశాలగా ఉన్న పిట్టిగుంట స్కూల్‌కు ప్రభుత్వం అదనంగా 4 ఉపాధ్యాయ పోస్టులు మంజూరుచేసింది. విద్యార్థుల సంఖ్య పెరగడంతో ప్రాథమికోన్నత పాఠశాలగా రమణారెడ్డి అప్‌గ్రేడ్ చేయించారు. అదనపు తరగతి గదులు కూడా మంజూరయ్యాయి.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు

నిత్యం పాఠశాల స్మరణతో పాటు.. బోధనే వృత్తి, ప్రవృత్తిగా మలుచుకుని విధులు నిర్వహిస్తున్న గానుగపెంట రమణారెడ్డికి అవార్డుల పంట పండిందనే చెప్పాలి. ఉప్పలూరులో పనిచేస్తున్నప్పుడు 2015లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడుగా, 2022లో పిట్టిగుంట పాఠశాలలో పనిచేస్తున్నప్పుడు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడుగా ఎంపికయ్యారు. ఇతని సేవలు గుర్తించిన ఒంగోలు జిల్లాకు చెందిన ఆదరణ సొసైటీ, భద్రాచలానికి చెందిన ఓసీ సంఘంతో పాటు పలు సంస్థలు సన్మానం చేశాయి.



ఉదయం ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు గానుగపెంట రమణారెడ్డి

విద్యార్థులకు న్యాయం చేయడమే లక్ష్యం



ప్రైవేట్ పాఠశాలలపై మోజుతో విద్యార్థులు పట్టణాలకు పరుగులు పెడుతున్న ఈ రోజుల్లో నన్ను నమ్ముకొని ప్రభుత్వ పాఠశాలకు వచ్చే పేద విద్యార్థులకు న్యాయం చేయాలన్నదే నాలక్ష్యం. సొంత డబ్బుతో పాటు దాతల సహకారంతో కార్పొరేట్ పాఠశాలకు దీటుగా విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు సమకూర్చుకుని వారి సమగ్రాభివృద్ధికి పాటుపడటం నాకు ఎంతో తృప్తినిస్తుంది.

- గానుగపెంట రమణారెడ్డి, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, పిట్టిగుంట ప్రాథమికోన్నత పాఠశాల

సంఘమిత్ర నియామకంపై విచారణ గందరగోళం

తంబళ్లపల్లె, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె మండలం కన్నెమడుగు సంఘమిత్రగా సుజన నియామకంపై శనివారం అధికారులు చేపట్టిన విచారణ గందరగోళంగా మారింది. తంబళ్లపల్లె మండలం కన్నెమడుగు సంఘమిత్రగా పనిచేస్తున్న వసంతకుమార్‌రెడ్డి కొన్ని నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన స్థానంలో ఈ ఏడాది ఆగస్టులో అదే గ్రామానికి చెందిన సుజన ఎన్నికై విధులు నిర్వహిస్తోంది. ఈ క్రమంలో నిబంధనలకు విరుద్ధంగా సంఘమిత్రను ఎన్నుకున్నారని, ఆమె నియామకం రద్దు చేయాలని కొద్ది రోజుల క్రితం కన్నెమడుగుకు చెందిన ఓవర్గం మహిళా సభ్యులు రాయచోటిలో కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన చేశారు. సమస్యను పరిష్కరించాలని కలెక్టరు పీడీని ఆదేశించడంతో శనివారం డీపీఎంలు లక్ష్మీప్రసాదరెడ్డి, వేణుమాదవ్, ఏపీఎం గంగాధర్‌లు స్థానిక వెలుగు కార్యాలయంలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా సంఘమిత్రను తొలగించి మరొకరిని నియమించాలని పట్టుబట్టడంతో గందరగోళం ఏర్పడింది. దీంతో డిసెంబరు 3వ తేదీ విచారణ చేసి చర్యలు తీసుకుంటామని అధికారులు చెప్పడంతో పలువురు మహిళా సభ్యులు ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ లోకేష్‌రెడ్డి సిబ్బందితో వచ్చి అనుమతి లేకుండా రోడ్డుపై బైఠాయించడం తగదని, చట్టాన్ని ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా పలువురు వైసీపీ నాయకులు ఆందోళన చేస్తున్న మహిళలకు మద్దతు పలికారు. కాగా ఎంపీడీవో కార్యాలయంలోకి వెళ్తున్న తమను అడ్డగించి అనుచితంగా ప్రవర్తించారని టీడీపీ నాయకులు రెడ్డెప్పరెడ్డి, సురేంద్ర వైసీపీ నాయకులు మదనమోహన్‌రెడ్డి, చౌడేశ్వర, కేఆర్‌మల్‌రెడ్డి,



ధర్నా చేస్తున్న వారితో మాట్లాడుతున్న ఎస్‌ఐ లోకేష్‌రెడ్డి

లక్ష్మీరెడ్డిలపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అదేవిధంగా ధర్నాలో పాల్గొని ఉద్యోగాలను దుర్వినియోగం చేసి, తమను అడ్డగించిన అంగన్వాడీలపై కూడా పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఇది రాజకీయ రంగు పులుముకుంది.

ప్రాణాలు తీస్తున్న ఒత్తిడి



- ఆత్మహత్యకు పాల్పడుతున్న వైనం
- ప్రతిరోజూ మానసిక వైద్యుని వద్దకు పదుల సంఖ్యలో విద్యార్థులు
- మార్కులు, ర్యాంకుల లక్ష్యాలే సమస్యలు
- తల్లిదండ్రుల్లో మార్పు రావాలంటున్న వైద్యులు

"మంచి ర్యాంకు కోసం కష్టపడి చదివాను ఈ మధ్య ఎందుకో బాగా చదవలేకపోతున్నా అనిపిస్తుంది. నాన్న చెప్పిన ర్యాంకు వస్తుందో లేదోనని భయం వేస్తోంది. నిద్రపట్టడంలేదు. ఆకలి అనిపించడంలేదు. ఇంట్లో వాళ్లకి చెప్పలేకపోతున్నా. ఏం చేయాలో అర్థం కావడం లేదు"- ఇది వైద్యుని వద్ద ఓ ఇంటర్ విద్యార్థి ఆవేదన. ఇది ఒక్క విద్యార్థి సమస్య మాత్రమే కాదు.. వేలమంది విద్యార్థుల సమస్య. లక్షల్లో ఫీజులు దండుకునే ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలకే కాదు.. అల్లారుముద్దుగా పెంచుకునే తల్లిదండ్రులకూ మార్కులు, ర్యాంకులే లక్ష్యం కావడంతో ఆ ఒత్తిడి అంతా పిల్లలపై పడుతోంది. దీంతో కొందరు ఆత్మహత్యా ప్రయత్నం చేస్తుండగా మరికొందరు డిప్రెషన్‌లోకి వెళ్లిపోతున్నారు. ఇప్పటికైనా విద్యార్థుల తల్లిదండ్రులు మేలుకోవాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

కడప ఎడ్యుకేషన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులపై మార్కులు, ర్యాంకులు ఒత్తిడి పెంచుతున్నాయి. దీంతో విద్యార్థులు మానసికంగా ఇబ్బంది పడుతున్నారు. గతంతో పోలిస్తే ఈ తరహా సమస్యలతో బాధపడుతున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. తమ బాధను ఎవరికీ చెప్పుకోలేక కొంతమంది మానసికంగా వేదన అనుభవిస్తున్నారు. డాక్టరు, ఇంజనీరు కావాలి. అందుకనుగుణంగా చదివి ర్యాంకు సంపాదించాలి. ఇదే చాలామంది తల్లిదండ్రులు లక్ష్యం. తమ లక్ష్యాన్ని బలవంతంగా పిల్లలపై రుద్దుతున్నారు. కొందరు లక్షలాది రూపాయలు అప్పు చేసి చదివిస్తున్నారు. జాగ్రత్తగా చదువుకో అంటూ మరికొందరు తల్లిదండ్రులు తమకు తెలియకుండానే పిల్లలపై వత్తిడి తీసుకువస్తున్నారు. ఆ బరువు మోసే యత్నంలో శక్తి సరిపోక కొంతమంది బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. తరగతిలో వెనుకబడినా.. మంచి ర్యాంకులు రాకపోయినా తరగతి గదిలో టీచర్లు అవమానకరంగా మాట్లాడినా భరించలేక ఎంతో మంది విద్యార్థులు డిప్రెషన్‌లోకి వెళుతున్నారు. ఒకసారి డిప్రెషన్‌లోకి వెళ్లిన విద్యార్థులు బయటికి రావడం కష్టమని, వారంతా ఈ జీవితం ఎందుకనే భావనతో బతుకుతుంటారని వైద్యులు చెబుతున్నారు.



రెండు ఉదాహరణలు..

- మార్కులు తక్కువ వస్తాయన్న దిగులుతో 2019 ఆగస్టులో కడప ఎన్జీవో కాలనీలో ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి రైలు కింద పడి ప్రాణాలు తీసుకున్నాడు. అయితే అధ్యాపకుల వేధింపుల వల్లనే తమ కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడని బాలుడి తండ్రి అప్పట్లో ఆరోపించారు.
- 2022 మార్చిలో అన్నమయ్య జిల్లా సంబేపల్లె మండలం ఎర్రగుంట్ల గురుకుల పాఠశాలలో పదోతరగతి విద్యార్థిని (15) ఆత్మహత్య చేసుకుంది. హాస్టలు గదిలో విష ద్రావణం తాగి ఆత్మహత్యకు యత్నించగా వెంటనే కడప రిమ్స్‌కు తరలించారు. రిమ్స్‌లో చికిత్స పొందుతూ విద్యార్థిని మృతిచెందింది. సరిగా చదవలేకపోతున్నానంటూ విద్యార్థిని సూసైడ్ నోట్ రాసింది. తమ కుమార్తె కొన్ని సబ్జెక్టులు చదవలేక వెనుకబడి ఉండడం వల్ల ఆత్మహత్యకు పాల్పడినట్లు విద్యార్థిని తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తల్లిదండ్రుల్లో మార్పు రావాలి




విద్యార్థులను చిన్నప్పటి నుంచే హాస్టళ్లలో చేర్పించి చదివించాలని భావించే తల్లిదండ్రులు వారి మానసిక శారీరక పరిస్థితిని అర్థం చేసుకోవాలి. తల్లిదండ్రులు ఎప్పుడూ పిల్లలకు లక్ష్యాలు పెట్టకుండా వారిలో ఉన్న ప్రతిభను గుర్తించి అందుకు అనుగుణంగా ప్రోత్సహించే ప్రయత్నం చేయాలి. అంతేకానీ ముందు నుంచే డాక్టరు కావాలి, ఇంజనీరు కావాలి, ఐఏఎస్, ఐపీఎస్ అంటూ లక్ష్యాలు విధించడం ద్వారా ఒత్తిడికి గురయ్యే ప్రమాదం ఉంది. గొప్పగొప్ప స్థానాలకు వెళ్ళిన వారు.. వారి ఇష్టపూర్వకంగా ఆయా రంగాలను ఎంచుకున్న వాళ్లే తప్ప తల్లిదండ్రుల ఒత్తిడితో ఎదిగిన వారు కాదనే విషయం గుర్తుచేసుకోవాలి. ఈ విషయంలో తల్లిదండ్రుల్లో తప్పనిసరిగా మార్పు రావాలని ర్యాంకులు, మార్కుల కోసం పిల్లలపై ఒత్తిడి పెంచవద్దని నిపుణులు చెబుతున్నారు. స్పెషల్ క్లాసులు, ట్యూషన్లు అంటూ ఒత్తిడికి గురిచేస్తే విద్యార్థి మానసిక ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతినే అవకాశం ఉందంటున్నారు. ఇంజనీరింగ్, డాక్టరు మాత్రమే కాదు, ఎన్నో రంగాల్లో అద్భుతమైన అవకాశాలు ఉన్నాయన్న విషయాన్ని తల్లిదండ్రులు గుర్తించాలంటున్నారు. విద్యార్థులు తీవ్రమైన ఒత్తిడికి గురయ్యేలా చేస్తున్నది తల్లిదండ్రులేనని వారిలో మార్పు రావలసిన అవసరం ఉందని వైద్యులు స్పష్టం చేస్తున్నారు.

కౌన్సెలింగ్ కేంద్రాలు ప్రశ్నార్థకం..

ప్రతి కళాశాలలో విద్యార్థులకు కౌన్సెలింగ్ చేసేందుకు అనుగుణంగా కేంద్రాలను ఏర్పాటు చేయాల్సిందిగా కేంద్రం సూచించింది. అయితే ఏ కళాశాలలోనూ ఈ తరహా కేంద్రాలను ఏర్పాటు చేయలేదని చెప్పవచ్చు. ఈ కేంద్రాలు ఉంటే రోజువారి యాక్టివిటీస్‌కు భిన్నంగా ఉండే విద్యార్థులను గుర్తించి కౌన్సెలింగ్ ఇవ్వడం ద్వారా సాధారణ స్థితికి తీసుకువచ్చేందుకు అవకాశం ఉంటుంది.

కౌన్సెలింగ్‌కు వస్తున్న వారిలో విద్యార్థులు ఎక్కువ..



ఈ మధ్యకాలంలో కౌన్సెలింగ్‌కు వస్తున్న వారిలో విద్యార్థులే ఎక్కువగా ఉంటున్నారు. నిద్రపట్టడం లేదని, కన్నుమూస్తే ర్యాంకులు, మార్కులు కనిపిస్తున్నాయని, ఆకలి లేదని, చనిపోవాలనిపిస్తుందంటూ కొంతమంది విద్యార్థులు చెబుతున్నారు. పరీక్షల భయంతో బాధపడుతున్న విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉంటోంది. తల్లిదండ్రుల ఒత్తిడి కారణంగా విద్యార్థులు నలిగిపోవడం వల్లనే ఈ సమస్య ఉత్పన్నమవుతోంది. ఈ సమస్యతో బాధపడుతున్న వారిలో ఎక్కువ మంది విద్యార్థులు డిప్రెషన్‌లోకి జారుతున్నారు. ఇది అత్యంత ప్రమాదకర సంకేతం. ఇందులో చాలామంది ఆత్మహత్యకు కూడా ప్రయత్నిస్తూ ఉంటారు. ముందుగానే గుర్తించి కౌన్సెలింగ్ ఇవ్వడం అవసరం. విద్యార్థులపై తీవ్రమైన ఒత్తిడి పనికిరాదు. ఈ విషయంలో తల్లిదండ్రులు ఆలోచన చేయాలి.

- ప్రొఫెసర్ డాక్టర్ వంశీక్రిష్ణ, మానసిక వైద్యనిపుణుల ఆసుపత్రి, కడప

జిల్లా కేంద్రంలోనే శిక్షణ ఇవ్వాలి

డీఈవోకు ఉపాధ్యాయ సంఘాల వినతి



డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నేతలు

రాయచోటిటౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రధానోపాధ్యాయులకు అందించే లీడర్ షిప్ ట్రైనింగ్‌ను జిల్లా కేంద్రంలోనే నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో నిర్వహించాలని డీఈవో సుబ్రమణ్యంకు శనివారం ఉపాధ్యాయ సంఘాల నేతలు వినతిపత్రాన్ని అందించారు. ఇటీవల పశ్చిమ గోదావరిలో నిర్వహించిన శిక్షణలో ఒక ప్రధానోపాధ్యాయుడు గుండెపోటుతో మరణించారని,మరొకరు ఐసీయూలో అడ్మిట్ అయ్యారని, ఆ సంఘటనలతో రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఇకపైన జిల్లాల వారీ జరుపుతామని హామీ ఇచ్చారని వినతిలో పేర్కొన్నారు. జిల్లాలోని రాయచోటి, మదనపల్లి డివిజనల్ ప్రధానోపాధ్యాయులకు 18వ తేదీ నుంచి అనంతపురం సెంటర్‌లోనే ట్రైనింగ్‌కి హాజరుకావాలని చెబుతున్నారన్నారు. జిల్లాలోని ఏ ఒక్క పాఠశాల కూడా అనంతపురంలో జరిగే ట్రైనింగ్ సెంటర్‌కి వంద కిలోమీటర్ల లోపల లేనందువలన అన్నమయ్య జిల్లాలోని ప్రధానోపాధ్యాయులు అందరికీ ట్రైనింగ్‌ను అన్నమయ్య జిల్లాలోనే ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో నోబెల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర బాధ్యులు శ్రీనివాసరాజు, ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు రామక్రిష్ణ, మడితాటి నరసింహారెడ్డి, జే.వెంకట్రామిరెడ్డి, ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు శివారెడ్డి, రామకృష్ణ, ఏపీటీఎఫ్ 257 జిల్లా అధ్యక్షుడు అబ్బవరం హరిబాబు, అపస్ జిల్లా అధ్యక్షుడు నరసింహులు, ఉపాధ్యాయులు కులశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులు, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు సదాశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొలంలోనే రైతుకు గుండెపోటు

మదనపల్లె అర్బన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పొలానికి ఎరువు బస్తా తీసుకెళుతుండగా గుండెపోటుతో కుప్పకూలిపోయాడు. దీంతో వెంటనే మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించేలోపే రైతు జి.నరసింహులు(45) మృతి చెందాడు. కుటుంబసభ్యుల వివరాల మేరకు తంబళ్లపల్లె మండలం, చౌడసముద్రం గ్రామం, గోవిందువారిపల్లెకు చెందిన నరసింహులు వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు.

శనివారం ఉదయం వ్యవసాయం పొలం వద్ద ఎరువు మోస్తున్న సమయంలో చాతీలో నొప్పి రావడంతో అక్కడే కుప్ప కూలిపోయాడు, సమచారం తెలుసుకున్న కుటుంబసభ్యులు 108 వాహనంలో మదనపల్లె



మృతి చెందిన రైతు నరసింహులు

జిల్లా ఆస్పత్రికి చికిత్స కోసం తరలించేలోపే మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. అనంతరం మృతదేహాన్ని గ్రామానికి తరలించారు. ఈయనకు భార్య, జయమ్మ ఉన్నారు. పిల్లలు లేరు.

వీపులో దిగబడిన కత్తి

- మదనపల్లెవాసికి జీహెచ్‌లో శస్త్రచికిత్స

చెన్నై, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా మదనపల్లెకు చెందిన వీరాస్వామి (44) అనే కార్మికుడి వీపులో 15 సెం.మీ.మేర దిగబడిన కత్తిని నగరంలోని రాజీవ్‌గాంధీ ప్రభుత్వ ఆస్పత్రి (జీహెచ్)లో వైద్యులు మూడు గంటలపాటు శస్త్రచికిత్స చేసి తొలగించారు. మూడు రోజుల క్రితం బంధువులతో జరిగిన ఘర్షణల్లో వీరాస్వామి కత్తిపోటుకు గురయ్యారు. వీపులో 15 సెం.మీ. లోతులో కత్తి దిగబడటంతో అక్కడి ఆస్పత్రుల్లో చికిత్స పొందేందుకు ప్రయత్నించారు. ఎక్కడా అతడికి శస్త్రచికిత్స చేసి కత్తిని తొలగించేందుకు వైద్యులు సాహసించలేకపోయారు. చివరకు చెన్నై ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీహెచ్)లో చికిత్స కోసం చేరాడు. వైద్యులు అన్ని పరీక్షలు చేసి మూడు గంటల పాటు శస్త్రచికిత్స జరిపి ఆ కత్తిని తొలగించారు. శనివారం ఈ విషయమై ఆ ఆస్పత్రి డీన్ థెరని రాజన్ మాట్లాడుతూ వీరాస్వామి వీపులో కత్తి దిగబడటం వల్ల అతడిని పడుకోబెట్టి ఆపరేషన్ చేయలేక కూర్చోబెట్టి అనస్తీషియా ఇచ్చి ఆపరేషన్ చేశామన్నారు. డాక్టర్ మారియప్పన్ నాయకత్వంలో ప్రొఫెసర్ డాక్టర్ శివన్‌రాజ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జయప్రకాష్‌తో కూడిన వైద్య బృందం ఈ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించిందని, ప్రస్తుతం అతడు పూర్తిగా కోలుకుని విశ్రాంతి తీసుకుంటున్నాడని ఆయన వివరించారు.

25 నుంచి 108 సిబ్బంది సమ్మె

అధికారులకు సమ్మె నోటీసు అందచేసిన 108 సిబ్బంది



ఎంపీడీవోకు సమ్మె నోటీసు అందజేస్తున్న 108 సిబ్బంది

కలికిరి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఏళ్లు గడుస్తున్నా తమ సమస్యలు పరిష్కారం కావడం లేదని ఈనెల 25 నుంచి సమ్మెలోకి వెళ్లనున్నట్లు 108 అంబులెన్సు సర్వీసుల సిబ్బంది సమ్మె నోటీసులు అందజేశారు. శనివారం స్థానిక ఎంపీడీవో, తహసీల్దారు, పోలీసుస్టేషన్లలో సమ్మె నోటీసులను అందజేశారు. 108 సర్వీసుల అంబులెన్స్ వ్యవస్థలో నిర్వహణ సంస్థలు మారినప్పుడల్లా తమకు రావలసిన గ్రాట్యుటీ, ఎర్న్‌డ్ లీవు పరిహారం, వార్షిక ఇంక్రిమెంట్లు ఇవ్వకుండానే ఆ సంస్థలు వైదొలుగుతున్నాయని నోటీసులో పేర్కొన్నారు.

దీంతో తాము ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి పరిష్కారంగా తమ ఉద్యోగాలను వైద్య ఆరోగ్య శాఖలో విలీనం చేసి 108 సర్వీసులను ప్రభుత్వమే నిర్వహించాలని కోరారు. టీడీపీ పాలనలో 2017లో విడుదల చేసిన 49వ నెంబరు జీవో ఆధారంగా ప్రతి ఉద్యోగికీ ప్రతి నెలా రూ.4 వేల వంతున చెల్లించే వారని గుర్తు చేశారు. వైసీపీ ప్రభుత్వం ఈ జీవోను రద్దు చేసి తమకు తీవ్ర అన్యాయం చేసిందని తెలిపారు. ఈ జీవోను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని అన్ని వైద్య కళాశాలల్లో చేపడుతున్న ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ పోస్టులకు అవసరమైన అర్హతలున్న వారు లేని కారణంగా భర్తీ చేయడం లేదని వెల్లడించారు. 108 సర్వీసుల్లో పనిచేస్తూ అనుభవం గడించిన ఈఎంటీలకు విద్యార్హతలను సడలించి నియామకాలు చేపట్టాలని కోరారు. 108 సర్వీసులు నిర్వహిస్తున్న సంస్థలు ప్రతి నెలా జీతాల చెల్లింపుల్లో తీవ్ర జాప్యం చేస్తున్న కారణంగా తాము కుటుంబాలతో మనుగడ సాగించలేకపోతున్నామని తెలిపారు. ప్రతి నెలా 5వ తేదీలోగా జీతాలు చెల్లించే విధంగా ఒప్పందం చేసుకుని అమలు చేయాలని కోరారు. వైద్య సర్వీసులకు సంబంధించి ఎక్కడా లేని విధంగా 108 సర్వీసుల్లో రోజుకు రెండు షిఫ్టుల వంతున షిఫ్టుకు 12 గంటల చొప్పున ఏకబిగిన పనిచేయిస్తూ తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్నారని ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. అలా కాకుండా వైద్య శాఖలోని అన్ని విభాగాల్లో అమలవుతున్న విధంగానే 108 సర్వీసు సిబ్బందికి కూడా రోజుకు మూడు షిఫ్టుల వంతున షిఫ్టుకు 8 గంటలతో పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సమ్మె నోటీసును అందజేసిన వారిలో కలికిరి 108 సర్వీసు సిబ్బంది ఈఎంటీలు చంద్రబాబు, యల్లమ్మ, పైలెట్‌లు వేణు, వెంకటస్వామి, ఎస్.వి. రమణలున్నారు.

జాతీయ వాలీబాల్ పోటీలకు రెడ్డివారిపల్లి విద్యార్థి

నిమ్మనపల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు నిమ్మనపల్లి మండలం రెడ్డివారిపల్లి జడ్పీ హైస్కూల్‌లో 8వతరగతి చదువుతున్న విద్యార్థి పి.రాజు ఎంపికైనట్లు హెచ్‌ఎం రమేష్‌బాబు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ త్వరలో వారణాశిలో జరగబోయే జాతీయస్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొంటాడని తెలిపారు. విద్యార్థి ఎంపిక పట్ల పీఈటీ గీతశ్రీ, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

మార్కెట్ యార్డు అంతేనా..!

- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా
- పరిహారం కింద వచ్చిన రూ.70 లక్షలు వృథా
- ప్రైవేటు నిర్మాణాలతో అన్యాక్రాంతం
- పట్టించుకోని అధికారులు



యార్డులో నిరుపయోగంగా ఉన్న శీతల గిడ్డంగులు

రాయచోటిటౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మాసాపేటకు సమీపంలో గల వ్యవసాయ మార్కెట్‌యార్డు దిక్కూ మొక్కూ లేకుండా అధ్వానంగా తయారైంది. ప్రహరీ లేకపోవడంతో అసాంఘిక కార్యాకలాపాలకు అడ్డాగా తయారైంది. దీనికి తోడు మార్కెట్‌యార్డు ఆవరణలో ప్రైవేటు వ్యక్తులు నిర్మాణాలు చేపట్టడంతో స్థలం అన్యాక్రాంతమవుతోంది. ఇక్కడ ప్రతి బుధవారం పశువుల సంతతో పాటు ఇతర వ్యాపారులు వచ్చి వారి పంటలను విక్రయించుకుంటారు. కాగా యార్డు ఆవరణంలో నిర్మించిన బియ్యం గోడౌన్‌లో ప్రస్తుతం ఈవీఎంలను భద్రపరిచారు. ప్రహరీగోడ లేకపోవడంతో వీటి భద్రత పైనా అనుమా నాలు వ్యక్తమవు తున్నాయి. వీటిపై మార్కెటింగ్ శాఖ అధికారులు శ్రద్ధ చూపడం లేదనే విమర్శలున్నాయి.

వ్యవసాయ ఉత్పత్తులకు నోచుకోని యార్డు

పేరుకే వ్యవసాయ మార్కెట్ యార్డు అయినప్పటికీ ఎటువంటి వ్యవసాయ ఉత్పత్తులకు యార్డు నోచుకోవడం లేదు. జిల్లా కేంద్రమైన రాయచోటి చుట్టుపక్కల వ్యవసాయ ఉత్పత్తులైన వేరుశనగతో పాటు పండ్లతోటల్లో ప్రధానంగా మామిడి, టమోటా తదితర పంటలను రైతులు అధికంగా సాగు చేస్తారు. అయితే ఈ వ్యవసాయ పంటలు ఏవీ కూడా మార్కెట్‌యార్డులో నిల్వ చేసి విక్రయించిన దాఖలాలు లేవు. వ్యవసాయ ఉత్పత్తులు మార్కెట్ యార్డుకు వస్తే ఆదాయం ఆశించిన స్థాయిలో ఉండేది. ఆ దిశగా వ్యవసాయ మార్కెట్ యార్డు అధికారులు కూడా చర్యలు చేపట్టకపోవడంతో చాలా మంది రైతులు పంటలను నిల్వ చేసుకునేందుకు అవకాశం లేక దళారుల ద్వారా వ్యాపారులకు విక్రయించి ఇంటి దారి పడుతున్నారు. ఈ ప్రాంతంలో మామిడి పంట అధికంగా ఉన్నప్పటికీ సీజన్‌లో చాలా మంది రైతులు పట్టణ నడిబొడ్డులోని ఠాణా సమీపంలో ప్రైవేటు వ్యక్తులు ఏర్పాటు చేసిన మామిడికాయల మండీలకు వెళ్లి అక్కడ దళారులు, వ్యాపారులు నిర్ణయించిన ధరలకే పంటలను విక్రయించే పరిస్థితులు నెలకొన్నాయి. దీనికి తోడు దక్షిణకాశీగా పిలవబడే భద్రకాళీ సమేత వీరభద్రాలయానికి సమీపంలో గల కూరగాయల మార్కెట్‌ను పట్టణంలోని కొత్తపేట దిబ్బలబడికి సమీపంలో నూతనంగా నిర్మించిన రైతు బజారులోకి మార్చాలని రూ.ఒక కోటి ఖర్చుతో రైతు బజారు నిర్మించినప్పటికీ అక్కడికి వ్యాపారులు రాకపోవడంతో ఆ రైతుబజార్ నేడు నిరుపయోగంగా మారింది.



మార్కెట్‌యార్డు స్థలంలో ప్రైవేటు వ్యక్తులు చేపట్టిన నిర్మాణాలు

ప్రహరీ నిర్మాణం ఎప్పుడో...?

జాతీయ రహదారి విస్తరణలో భాగంగా సుమారు ఐదు సంవత్సరాల క్రితం తొలగించిన వ్యవసాయ మార్కెట్‌యార్డు ప్రహరీగోడ నిర్మాణం ఎప్పుడు జరుగుతుందో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. అప్పట్లో జాతీయ రహదారి విస్తరణలో తొలగించిన ప్రహరీగోడ స్థానంలో నూతన ప్రహరీ గోడ నిర్మాణం కోసం ఎన్‌హెచ్ అధికారులు సుమారు రూ.70 లక్షలకు పైగా పరిహారాన్ని చెల్లించారు. ఆ డబ్బుతో ప్రహరీగోడను నిర్మించి బయట వ్యక్తులను యార్డులోకి ప్రవేశించకుండా చూడాల్సిన వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారులు ఆ విధంగా శ్రద్ధ చూపలేదనే విమర్శలున్నాయి. ప్రహరీ గోడ లేని కారణంగా ప్రస్తుతం బయట వ్యక్తులు పగలు, రాత్రి అనే తేడా లేకుండా యార్డులోకి ప్రవేశించి అసాంఘిక కార్యకలాపాలకు వాడుకుంటున్నారు. మార్కెట్‌యార్డు అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపడితే అటు వ్యాపారులతో పాటు ఇటు రాయచోటి ప్రాంతంలోని రైతన్నలకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

టెండర్లు పిలుస్తున్నా రావడం లేదు

- మదన్‌మోహన్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్‌యార్డు సెక్రటరీ, రాయచోటి

నూతన ప్రహరీ గోడ ఏర్పాటు కోసం 2021 సంవత్సరం నుంచి టెండర్లు పిలు స్తున్నా కాంట్రాక్టర్లు ఎవ్వరూ ముందుకు రావడం లేదు. ప్రహరీగోడ నిర్మాణంతో పాటు జాతీయ రహదారి నుంచి బియ్యం గోడౌన్, మార్కెట్ యార్డు కార్యాలయం వరకు సిమెంటు రోడ్డు ఏర్పాటు కోసం రూ.65 లక్షలతో పలుమార్లు టెండర్లు పిలిచాము. 20 ఎకరాలకు పైగా ఉన్న మార్కెట్ యార్డులో గతంలో సర్వే చేయించి కంపచెట్లను, పిచ్చిమొక్కలను తొలగించాం. స్థలం ఎక్కడా అన్యాక్రాంతానికి గురికాలేదు. ప్రహరీగోడ నిర్మాణానికి, సిమెంటు రోడ్డు ఏర్పాటుకు వ్యవసాయ మార్కెట్‌యార్డు ఖాతాలో నిధులు ఉన్నాయి. ఎవరైనా టెండర్లు వేస్తే నిర్మాణాలను పూర్తి చేస్తాం.

నిధుల దుర్వినియోగంపై విచారణ

సుండుపల్లె, నవంబరు16(ఆంధ్రజ్యోతి): మండలంలో అభివృద్ధి నిధులు దుర్వినియోగంపై విచారణ చేపట్టారు. మండలవాసి కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో శనివారం విచారించినట్లు డీపీఓ బాలకృష్ణారెడ్డి తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జరిగిన పనులపై రికార్డులు తనిఖీ చేశామన్నారు. మండల వ్యాప్తంగా పలు పంచాయతీల్లో మండల నిధులు పెద్ద మొత్తంలో దుర్వినియోగమైనట్లు ఫిర్యాదు వచ్చిందన్నారు. ఎక్కడెక్కడ ఏం పనులు చేశారు. ఆ బిల్లులను పరిశీలించామన్నారు. విచారణ నివేదికను అధికారులకు అందజేయనున్నట్లు తెలియజేశారు. ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆకాశదీపం



కోదండరామాలయంలో ఆకాశదీపం వెలిగిస్తున్న మహిళలు

రైల్వేకోడూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కొత్తబజారు వీధిలో వెలసిన కోదండరామాలయంలో శుక్రవారం రాత్రి ఆకాశదీపం ఆలయ నిర్వాహకులు మండల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. మహిళా భక్తులు దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో శివుడి ప్రతిమను పెట్టి పూజలు చేసి, భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

శివాలయంలో ప్రకాశించిన దీపోత్సవం

పెనగలూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కార్తీకపౌర్ణమిని పురస్కరించుకుని శివాలయాల్లో శుక్రవారం రాత్రి మహిళలు భారీ స్థాయిలో దీపాలు వెలిగించారు. కార్తీక పౌర్ణమినాడు ఆకాశంలో చంద్రుడు ప్రకాశిస్తుండగా శివాలయాల్లో దీపోత్సవాలతో ఆలయా ల్లో దీపకాంతులు దేదీప్యమానంగా వెలుగొందాయి.

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న అంగన్వాడీలు

రాయచోటి(కలెక్టరేట్), నవంబరు16(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు మాట్లాడుతూ గత ప్రభుత్వం తమ యూనియన్‌తో చేసుకున్న ఒప్పందం ప్రకారం అంగన్వాడీ వర్కర్ల జీతాలను, ఇతర అలవెన్సులను ప్రస్తుత ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ నేతలు బంగారుపాప, ఓబులమ్మ, ఈశ్వరమ్మ, భాగ్యలక్ష్మి, గౌరీ, మధురవాణి, శ్రీవాణి, సుకుమారి, సిద్దమ్మ, సుభద్ర, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

'నారా రామ్మూర్తి నాయుడు మృతి తీరనిలోటు'



నివాళులర్పిస్తున్న చమర్తి

రాజంపేట టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నారా రామ్మూర్తినాయుడు మృతి పార్టీకి తీరని లోటని టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్ రాజు అన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో రామ్మూర్తినాయుడు చిత్రపటానికి చమర్తి, టీడీపీ నేతలు, కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ అద్దేపల్లె ప్రతాప్‌రాజు, దగ్గుబాటి సుబ్రమణ్యం నాయుడు, టీఎన్ఎస్ఎఫ్ నేత వేణుగోపాల్, గుల్జార్‌బాషా, కరీం, రాజేష్, న్యాయవాది హనుమంతు నాయుడు, కొల్లి రెడ్డయ్య, కొవ్వూరు సుబ్రమణ్యం నాయుడు, ఆనంద్, సతీష్‌రాజు, కోటయ్యనాయుడు, పరశురాం పాల్గొన్నారు.

సుగవాసికి శివపార్వతుల కల్యాణ ఆహ్వానం



శివపార్వతుల కల్యాణానికి సుగవాసిని ఆహ్వానిస్తున్న టీడీపీ నేతలు

సిద్దవటం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నిత్యపూజేశ్వర కోనలో కార్తీక సోమవారం శివపార్వతుల కల్యాణ మహోత్సవానికి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యంకు ఆహ్వానపత్రిక అందించారు. టీడీపీ నేత సుబ్బారెడ్డి, పార్లమెంట్ కార్యదర్శి నాగమునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

పుల్లంపేట, నవబంరు 16 (ఆంధ్రజ్యోతి): అప్పయ్యరాజుపేట రైల్వే గేట్ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని కల్లూరి వెంకటరమణ అలియాస్ చిరంజీవి మృతిచెందినట్లు పుల్లంపేట ఎస్ఐ మోహన్ కుమార్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం అర్ధరాత్రి రోడ్డు దాటుతుండగా ఈ ప్రమాదం జరిగినట్లు ఆయన తెలిపారు.

ఉప్పరపల్లెలో ఘనంగా పడిపూజ

సిద్దవటం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉప్పరపల్లె భద్రావతి భావనారాయణ స్వామి ఆలయంలో అయ్యప్ప స్వాముల పడిపూజ వేడుకగా నిర్వహించారు. గురుస్వామి శ్రీరామదాసు మాట్లాడుతూ అయ్యప్ప స్వాముల గ్రామోత్సవం సందర్భంగా పడిపూజ నిర్వహించామని రాత్రికి గ్రామోత్సవం జరుగుతుందని, భక్తులకు అన్నప్రసాదాలు ఏర్పాటు చేశామన్నారు. గురుస్వాములు చలపతి, భీమిశెట్టి శివరామయ్య, జున్నాధుల మురళి, అయ్యప్పస్వాములు గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లెలో వైభవంగా....

లక్కిరెడ్డిపల్లె, నవంబరు16(ఆంధ్రజ్యోతి): నామాలగుండుపై వెలసిన అమ్మప్పస్వామికి కార్తీక పౌర్ణమి సందర్భంగా పడిపూజ నిర్వహించారు. రామాపురం, లక్కిరెడ్డిపల్లె, గాలివీడు, రాయచోటికి మండలాల అయ్యప్ప మాలధారులు అంబుళం పూజ నిర్వహించారు.

ఉచిత కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోండి

స్టైఫండ్, మెరుగైన కోచింగ్ : టీడీపీ నేత మౌర్యారెడ్డి

రాయచోటిటౌన్, నవంబరు16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందించే ఉచిత డీఎస్సీ కోచింగ్‌ను టెట్ అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ నేత మౌర్యారెడ్డి పేర్కొన్నారు. శనివారం కొత్తపేట రాజుబుక్ స్టాల్ వద్ద బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఉచిత డీఎస్సీ కోచింగ్ సెంటర్‌ను ప్రారంభించారు. అభ్యర్థులకు ఉచిత కోచింగ్, నెలకు రూ.1500 స్టైఫండ్ ఇస్తారన్నారు. బీసీ, ఎస్సీ ఎస్టీ, ఈబీసీ, మైనార్టీ అభ్యర్థులను నిబంధనల ప్రకారం తీసుకుంటారని, ఆసక్తి గల వారు సంప్రదించాలన్నారు.

గృహనిర్మాణాలకు వీఓ రుణం పంపిణీ

పెనగలూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మధ్యలో ఆగిపోయిన నిర్మాణాలను పూర్తి చేసేందుకు ఐకేపీ ద్వారా విలేజ్ ఆర్గనైజేషన్ రుణం మూడు లక్షల రూపాయల నిధులను ఆరుగురు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కంబాలకుంట బీసీ కాలనీలోని గణేష్ ఎస్‌హెచ్‌జీ, శ్రీకృష్ణ చైతన్య ఎస్‌హెచ్‌జీ, సిద్దవరంలో రాజేశ్వరి ఎస్‌హెచ్‌జీ లబ్ధిదారునికి రూ.50 వేల చెక్కును అందజేశారు.

మంత్రి అచ్చెన్నాయుడిని కలిసిన కుప్పాల

సిద్దవటం, నవంబ రు 16 (ఆంధ్రజ్యో తి): వ్యవసాయ శాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడును పంచాయతీరాజ్ ఛాంబర్ ఆర్గనైజింగ్ సెక్రటరి కుప్పాల వెంకట సుబ్బయ్య కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. మండల సమస్యలను ఆయనకు తెలిపారు.

గంగనపల్లికి శ్రీకృష్ణదేవరాయ అవార్డు

నందలూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాయల్‌సేవా సమితి అధ్యక్షుడు గంగనపల్లి శ్రీనివాసులును శ్రీకృష్ణదేవరాయలు అవార్డుతో సత్కరించారు. సిటిజెన్ వెల్ఫేర్ ఫోరమ్, ఫ్రైడ్ ఇండియా కల్చరల్ సంయుక్తంగా కాళహస్తి ఎంవీఎస్ ఫంక్షన్‌హాలులో నేషనల్ లెవల్ ఆర్ట్స్ కల్చరల్ అవార్డు ఫెస్ట్‌లో అవార్డును అందజేశారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవు : పీడీ

సంబేపల్లె, నవంబరు16(ఆంధ్రజ్యోతి): ఉపాధిలో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని డబ్ల్యూఎంఏ వెంకటరత్నం తెలిపారు. శనివా రం సామాజిక తనిఖీ బహిరంగ సమావేశంలో 1-4-2023 నుంచి 31-3-2024 వరకు ఉపాధి హామీలు రూ.16 కోట్ల15 లక్షలు జరిగిన పనులకు సామాజిక బృందం తనిఖీ చేపట్టారు. గ్రామాల వారీ జరిగిన పనుల వివరాలను చదివి వినిపించారు.

క్యాన్సర్ అవగాహనపై ఇంటింటి సర్వే

సిద్దవటం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): బాకరాపేటలో క్యాన్సర్ అవగాహనపై ఇంటింటి సర్వే నిర్వహించారు. నోటి క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ లక్షణాలపై సర్వే నిర్వహించారు. హెల్త్ సూపర్‌వైజర్ రమణయ్య మాట్లాడుతూ మాధవరం వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ ఆధ్వర్యంలో గ్రామాల్లో సర్వే నిర్వహిస్తున్నామన్నారు.

విద్యార్థుల నడవడికపై దృష్టి సారించాలి : డీఈఓ



స్కూల్‌లో తనిఖీ చేపడుతున్న డీఈఓ సుబ్రమణ్యం

సుండుపల్లె, నవంబరు16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల నడవడికపై పాఠశాలలో ఉపాధ్యాయులు, ఇళ్ల దగ్గర తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రమణ్యం సూచించారు. శనివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మాధురి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌ను తనిఖీ చేసిన ఆయన జడ్పీహైస్కూల్‌లో ఉపాధ్యాయులతో మాట్లాడుతూ చదువు, క్రమశిక్షణతో మెలిగేలా చూడాలని ఆదేశించారు. విద్యార్థులు పాఠశాలకు సమయానికి వస్తున్నారా లేదా. వచ్చిన తర్వాత పాఠశాల ఆవరణలో ఎలా మెలుగుతున్నారనే విషయాన్ని గమనించాలని సూచించారు. టెన్త్ పరీక్షల్లో విద్యార్థినీ, విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించేలా చూడాలని, సబ్జెక్టులు పూర్తి జరిగిన విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఆపార్ నమోదు తప్పక చేయాలని ఆదేశించారు. ఉపాధ్యాయులు ప్రవర్తన నియమావళి పాటించాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించాలన్నారు. ప్రభుత్వ బడుల ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించాలన్నారు. మాధురి స్కూల్‌లో విద్యార్థులకు కావాల్సిన సౌకర్యాల, మరుగుదొడ్లపై తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకటేశ్ నాయక్, రవీంద్రనాయక్, మాధురి స్కూల్ కరస్పాండెంట్ రేవన సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

హసనాపురంలో టీడీపీ సభ్యత్వ నమోదు

రామాపురం, నవంబరు16(ఆంధ్రజ్యోతి): హసనాపురం గ్రామం చీకటివాండ్ల పల్లెలో శనివారం టీడీపీ నేతలు పప్పిరెడ్డి హరినాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో ఇరుగులురెడ్డి, బాలగంగాధర్‌రెడ్డి, పక్కీర్‌రెడ్డి, పెంచల్‌రెడ్డి, యోగాంజనేయులరెడ్డి, రమేశ్, వీరాంజనేయులు, చిన్నరామయ్య, నాగరాజ, వెంకటేశ్‌తో కలిసి రామాపురం ఐటీడీపీ జనరల్ సెక్రటరీ గణేశ్, ఐటీడీపీ ఛాంపియన్ నాగభూషణ్‌రెడ్డి పాల్గొన్నారు.

పోటీలు నైపుణ్యాన్ని పెంపొందిస్తాయి

గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి అమీరుద్దీన్

రామాపురం, నవంబరు16 (ఆంధ్రజ్యోతి): వ్యాసరచన, వక్తృత్వపు పోటీలతో విద్యార్థుల్లో మేధాశక్తి పెపొందించవచ్చని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి అమీరుద్దీన్ అన్నారు. శనివారం రామాపురం శాఖ గ్రంథాలయం పరిధిలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన వ్యాసరచన పోటీల్లో ఆయన మాట్లాడుతూ గతంలో గ్రంథాలయాలను ఉపయోగించుకుని ఉన్నత పదవులు పొందారన్నారు. గ్రంథాలయాల్లో విద్యార్థులకు పనికి వచ్చే అన్ని పుస్తకాలు అందుబాటులో ఉంటాయని, వాటిని ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి సూర్యనారాయణరెడ్డి, వెంకటేశ్వర హైస్కూల్ కరస్పాండెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, రాజశేఖర్, వెంకటక్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు

ఉద్యమకారులకు నివాళులు

రైల్వేకోడూరు, నవంబరు 16:(ఆంధ్రజ్యోతి) స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలను అధికారి శ్రీనివాసులు ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖులు డాక్టర్ ఎస్. రంగనాథన్, పాతూరి నాగభూషణం, ఐఎన్‌జి వెంకటరమణయ్య చిత్ర పటాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో జడ్పీ బాలికల హైస్కూల్ విద్యార్థినులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జడ్పీ హైస్కూల్‌లో...

సంబేపల్లె, నవంబరు16(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని ప్రధానోపాధ్యాయుడు మడితాటి నరసింహారెడ్డి తెలిపారు. శనివారం జడ్పీహైస్కూల్‌లో గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్‌ను గ్రంథాలయాధికారి శేఖర్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. గ్రంథాలయ అధికారి శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ నవంబరు 14 నుంచి 20వ తేదీ వరకు వారోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. డిజిటల్ గ్రంథాలయాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం, క్విజ్ క్రీడా పోటీలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దేవప్రసాద్‌రెడ్డి, పీఎం బాషా, విజయభాస్కర్, రవిశంకర్, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

గాలివీడు, నవంబరు16(ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి రామచంద్రనాయక్ ఆధ్వర్యంలో జూనియర్స్, సీనియర్స్ విభాగంలో జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీ పరీక్షకు 150 మంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

గర్భిణులకు ఆర్థిక సహాయం



నగదు పొందిన గర్భిణులు, బాలింతలతో ముక్కా వరలక్ష్మీ

పెనగలూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 16 మంది గర్భిణులు, బాలింతలకు ముక్కా రూపానందరెడ్డి చారిటబుల్ ట్రస్టు ఆర్థిక సాయం అందించింది. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్ చిట్వేలి ప్రాజెక్టు డీపీఓ నిర్మలజ్యోతి అధ్యక్షతన ముక్కా రూపానందరెడ్డి చారిటబుల్ ట్రస్టు ద్వారా రైల్వేకోడూరు నియోజకవర్గ టీడీపీ నాయకురాలు ముక్కా వరలక్ష్మీ ఒక్కొక్కరికి రూ.5 వేల వంతున అందించారు. గతంలో పెనగలూరులో జరిగిన 'ఇది మంచి ప్రభుత్వం'లో పాల్గొన్న అడా ఛైర్మన్ ముక్కా రూపానందరెడ్డి ప్రకటన మేరకు ఆయన సతీమణి ముక్కా వరలక్ష్మీ గర్భిణులకు నగదు అందించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఇద్దరు బాలింతలు తమ ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉందని సాయం చేయాలని కోరగా అందుకు ఆమె స్పందించి మెరుగైన వైద్యం చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీనియర్ సూపర్ వైజర్ రాజేశ్వరి, విజయకుమారి, విశాలాక్షి, ఎంపీ డీఓ విజయరావు, టీడీపీ నేతలు లేబాక శ్రీనివాసులరెడ్డి, దాసరి దామోదర్ నాయుడు, సుదర్శన్ చౌదరి, కొత్త బాలకృష్ణ, నరేష్‌బాబు, చిగురుపాటి ధనుంజయనాయుడు, హరిప్రసాద్ రెడ్డి, సత్యనారాయణనాయుడు, గుబ్బూరు హరి రాయల్, గంగినాయుడు, కేఎస్ఆర్ నాగేశ్వరరావు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో 18 మందికి జరిమానా

రాయచోటిటౌన్, నవంబరు16(ఆంధ్రజ్యోతి): రెండు వేర్వేరు డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో 18 మంది నిందితులకు కోర్టు జరిమానా విధించింది. రాయచోటిలో 12 మంది, సంబేపల్లె మండలంలో ఆరుగురికి ఒక్కొక్కరికి రూ.10,500లు చొప్పున జరిమానా విధించింది. వివరాల్లోకెళితే...

రాయచోటి అర్బన్ సీఐ చంద్రశేఖర్ కథనం మేరకు రాయచోటిలోని పలు ప్రాంతాల్లో శనివారం పోలీసు సిబ్బంది వాహనాల తనిఖీ చేపట్టారు. ఇందులో మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన బండి వీరమోహన్, విజయ్ పాండ్యన్, చంద్రశేఖర్, షేక్. హసన్, షేక్. మన్సూర్, పసుపులేటి కిరణ్‌కుమార్, సోమారపు నివాస్, శెట్టిపల్లి ప్రసాద్, కోత్వాల్ ఆసిఫ్, షేక్. అబూబకర్, హరేందర్‌కుమార్, కుమార్‌ను కోర్టులో హాజరు పరచగా కోర్టు ఒక్కొక్కరికి రూ.10,500లు చొప్పున 12 మందికి మొత్తం రూ.1,26,000లు జరిమానా విధించినట్లు అర్బన్ సీఐ తెలియజేశారు.

సంబేపల్లె మండలంలో ఆరుగురికి

సంబేపల్లె, నవంబరు16(ఆంధ్రజ్యోతి): మండలంలో మద్యం తాగి వాహనాలను నడిపిన కేసులో ఆరుగురికి కోర్టు జరిమానా విధించింది. ఒక్కొక్కరికి రూ.10,500 జరిమానా విధించినట్లు సంబేపల్లె ఎస్ఐ భక్తవత్సలం తెలిపారు. ఈశ్వరయ్య, సయ్యద్ అజానుల్లా, డీ. రాజన్న, సీ. ఆంజనేయులు, వై. రమేశ్‌రెడ్డి, మధు మద్యం తాగి డ్రైవింగ్ చేస్తుండగా కేసులు నమోదయ్యాయి. ఈ కేసులను శనివారం జడ్జి విచారించి వీరికి జరిమానా విధించినట్లు తెలిపారు.

ఎంఆర్‌పీఎస్ భవనం ప్రారంభం

రామాపురం, నవంబరు16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఎంఆర్‌పీఎస్ (మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి) కార్యాలయాన్ని శనివారం ప్రారంభించారు. ప్రారంభోత్సవంలో ఎంఆర్‌పీ ఎస్ రాష్ట్ర కార్యదర్శి పెద్దపల్లి శేఖర్ మాట్లాడుతూ మాదిగల హక్కుల కోసం కృషి చేస్తానన్నారు. ఎంఆర్‌పీఎస్ నేతలు చెన్నకే శవ, బాబు, ఆంజనేయులు, రమణయ్య, శంకర్ పాల్గొన్నారు.

ప్రణాళికలతో నిధులు ఖర్చు చేయాలి

నందలూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): 15వ ఆర్థిక సంఘం నిధులను ప్రణాళికా బద్ధంగా ఖర్చు చేయాలని ఎంపీడీఓ సుజాతమ్మ సూచించారు. సభాభవనంలో పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై నిర్వహించిన శిక్షణలో ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో ప్రజలకు అవసరమైన పనులను గుర్తించి వాటిని పూర్తి చేయాలన్నారు. ఈఓపీఆర్డీ సతీష్‌కుమార్, సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ సెక్రటరిలు, డిజిటల్ అసిస్టెంట్‌లు, వీఓలు, మండల అధికారులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయం వద్ద నేడు అన్నదానం

రాజంపేట, నవబంరు 16 (ఆంధ్రజ్యోతి): సాయిబాబా ఆలయం 25వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం అన్నదానం నిర్వహిస్తారని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. తెల్లవారుజాము నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహిస్తారన్నారు. స్వామివారికి ప్రత్యేక బృందాలచే భజన, పల్లకిసేవ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు పాల్గొనాలని కోరారు.

రోగులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ

రాయచోటిటౌన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): జాతీయ పత్రికా దినోత్సవం పురస్కరించుకుని ఏరియా ఆస్పత్రిలో సీనియర్ వైద్యుడు లక్ష్మిప్రసాద్ ద్వారా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు రోగులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేశారు. ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఏపీయూడబ్ల్యుజే) ప్రింట్ మీడియా జిల్లా అధ్యక్షుడు గౌనిపల్లి శ్రీనివాస్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమేశ్ కుమార్ రాజు, ఈశ్వరయ్య మాట్లాడుతూ నేటి సమాజంలో పత్రికా స్వేచ్ఛ హరించుకు పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వర్కింగ్ జర్నలిస్టు లందరికీ ప్రభుత్వం ఇంటి స్థలాలను ఇస్తూ ప్రత్యేకంగా జర్నలిస్టు కాలనీలు ఏర్పాటు చేయాలని చేశారు. యూనియన్ నేతలు మురళీ మోహన్, తాతయ్య, మునెయ్య, రాజమోహన్, ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

అలుపెరగని అయ్యవారు

- నిత్యం బడినామస్మరణే
- ఎక్కడ పనిచేసినా తనదైన ముద్ర
- పిట్టిగుంటలో విద్యార్థుల సంఖ్య 3 నుంచి 103కు చేర్చిన ఘనత
- తన జీతంతో వలంటీర్ల ఏర్పాటు
- సొంతడబ్బు, దాతల సహకారంతో సౌకర్యాలు

కాశినాయన, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగం అంటేనే ఇలా వచ్చామా.. అలా వెళ్లామా అనేతీరులో పనిచేసేవారే ఎక్కువ. అందుకు భిన్నంగా విధులు నిర్వహిస్తూ పలువురి మన్ననలను పొందుతున్న అలుపెరగని అయ్యవారు గానుగపెంట రమణారెడ్డి. కాశినాయన మండలం చెన్నారెడ్డిపల్లెలోని దిగువ మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన రమణారెడ్డి విద్యాభ్యాసం అంతా సర్కారు బడుల్లోనే సాగింది. 1998లో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. మొదట కవలకుంట్ల ప్రాథమిక పాఠశాలలో బాధ్యతలు స్వీకరించి బదిలీ అయ్యేనాటికి ఆ పాఠశాలను ఉన్నత పాఠశాల స్థాయికి తీర్చిదిద్దారు.

మూతబడే పాఠశాలల ఎంపిక

ప్రభుత్వ బదిలీల్లో భాగంగా మంచి పాఠశాలల్లో పోస్టింగ్ వచ్చే అవకాశం ఉన్నా మూరుమూల పల్లెల్లో మూతబడే దశలో ఉన్న పాఠశాలనే ఎంపిక చేసుకోవడం రమణారెడ్డి ప్రత్యేకత. పాఠశాల పురోగతిలోకి రాకపోతే చెడ్డపేరు వస్తుందని తోటి మిత్రులు, సహచర ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు వారించినా మొండిగా ముందుకెళ్లి పాఠశాల స్థితిగతులను మార్చి తానేంటో నిరూపించుకుంటూ ముందుకు సాగుతున్నారు. ఉప్పలూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా చేరే నాటికి అక్కడ విద్యార్థుల సంఖ్య కేవలం 14 మంది. తనదైన రీతిలో విద్యార్థులకు ఉచితంగా పరీక్ష సామాగ్రి, నోట్‌పుస్తకాలు, అవసరమైన బోధనోపకరణాలు, దుస్తులు అందించడంతో



చెట్టుకింద పాఠాలు బోధిస్తున్న రమణారెడ్డి (ఫైల్)

పాటు నిత్యం విద్యార్థులకు అందుబాటులో ఉంటూ బోధనచేయడంతో అక్కడ విద్యార్థుల సంఖ్య 54కు చేరింది. దీంతో రమణారెడ్డికి ఉపాధ్యాయలోకంలో ప్రత్యేక గుర్తింపు వచ్చింది. అనంతరం 2017లో ప్రభుత్వ బదిలీల్లో మంచి పాయింట్లతో కోరుకున్న పాఠశాలలో పోస్టింగ్ లభించే అవకాశం ఉన్నప్పటికీ ముగ్గురు విద్యార్థులతో మూతబడే దశలో ఉన్న పిట్టిగుంట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఎంచుకున్నారు. గ్రామంలో కలియతిరిగారు. పోరుమామిళ్ల, కలసపాడు లాంటి పట్టణాల్లోని ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. సర్వం తానే బాధ్యత తీసుకుంటాను అంటూ వారికి నమ్మకం కలిగించారు. విద్యార్థుల సంఖ్యను 25కు పెంచారు. సొంత ఖర్చులతో ముగ్గురు వలంటీర్లను ఏర్పాటు చేసుకుని ఉదయం పాఠశాల సమయంకంటే ముందు స్టడీ అవర్స్ పెట్టారు. సెలవుదినాల్లో బడి నిర్వహించేవారు. వెనుకబడిన విద్యార్థులకు సాయంత్రం 6గంటల నుంచి 8గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహించారు. గణితం, సైన్సు, ఇంగ్లీషులో ప్రత్యేక శిక్షణ, వేసవి సెలవుల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించారు. కరోనా సమయంలో రాష్ట్రమంతటా పాఠశాలలు మూతబడినా పిట్టిగుంట ప్రాథమిక పాఠశాలలో రోజుకు ఒక తరగతి చొప్పున పిలిపించుకుని పాఠాలు బోధించారు. విద్యార్థుల్లో విద్యాసామర్థ్యాలు పెరిగాయి. మండలంలో ఏ పోటీ పరీక్షలు నిర్వహించినా రమణారెడ్డి పాఠశాలలో చదివే విద్యార్థులే ప్రథమస్థానంలో నిలిచేవారు. సొంత నిధులతో పాటు దాతల సహకారంతో కంప్యూటర్, టీవీ, లైబ్రరి, బోధనోపకరణాలు సమకూర్చారు. ప్రారంభంలో సరిపడిన గదులు లేకపోయినా చెట్టుకిందనే పాఠాలు బోధించేవారు. దాతల సహకారంతో ప్రత్యేక షెడ్డు ఏర్పాటు చేయించారు. పాఠశాలలో స్కూల్‌డేలు, జాతీయ పర్వదినాలు నిర్వహించేవారు. దీంతో విద్యార్థుల సంఖ్య క్రమంగా 103కు చేరింది. మీడియాలో సక్సెస్ కథనాలు అనేకం ప్రచురితమయ్యాయి. దీంతో రాష్ట్రమంతా పిట్టిగుంట ప్రాథమిక పాఠశాల వైపు చూసేలా చేశారు. దీన్ని ఒక కేస్‌స్టడీగా తీసుకుని రాష్ట్ర స్థాయి కమిటీలు వచ్చి పరిశీలించి పోయాయి. ఇప్పటికీ ఈ కార్యక్రమాలన్నీ ఈ పాఠశాలలో కొనసాగుతున్నాయి.

ప్రాథమికోన్నత స్థాయికి పెంపు

ఒకే గదితో ఏకోపాధ్యాయ ప్రాథమిక పాఠశాలగా ఉన్న పిట్టిగుంట స్కూల్‌కు ప్రభుత్వం అదనంగా 4 ఉపాధ్యాయ పోస్టులు మంజూరుచేసింది. విద్యార్థుల సంఖ్య పెరగడంతో ప్రాథమికోన్నత పాఠశాలగా రమణారెడ్డి అప్‌గ్రేడ్ చేయించారు. అదనపు తరగతి గదులు కూడా మంజూరయ్యాయి.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు

నిత్యం పాఠశాల స్మరణతో పాటు.. బోధనే వృత్తి, ప్రవృత్తిగా మలుచుకుని విధులు నిర్వహిస్తున్న గానుగపెంట రమణారెడ్డికి అవార్డుల పంట పండిందనే చెప్పాలి. ఉప్పలూరులో పనిచేస్తున్నప్పుడు 2015లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడుగా, 2022లో పిట్టిగుంట పాఠశాలలో పనిచేస్తున్నప్పుడు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడుగా ఎంపికయ్యారు. ఇతని సేవలు గుర్తించిన ఒంగోలు జిల్లాకు చెందిన ఆదరణ సొసైటీ, భద్రాచలానికి చెందిన ఓసీ సంఘంతో పాటు పలు సంస్థలు సన్మానం చేశాయి.



ఉదయం ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు గానుగపెంట రమణారెడ్డి

విద్యార్థులకు న్యాయం చేయడమే లక్ష్యం



ప్రైవేట్ పాఠశాలలపై మోజుతో విద్యార్థులు పట్టణాలకు పరుగులు పెడుతున్న ఈ రోజుల్లో నన్ను నమ్ముకొని ప్రభుత్వ పాఠశాలకు వచ్చే పేద విద్యార్థులకు న్యాయం చేయాలన్నదే నాలక్ష్యం. సొంత డబ్బుతో పాటు దాతల సహకారంతో కార్పొరేట్ పాఠశాలకు దీటుగా విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు సమకూర్చుకుని వారి సమగ్రాభివృద్ధికి పాటుపడటం నాకు ఎంతో తృప్తినిస్తుంది.

- గానుగపెంట రమణారెడ్డి, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, పిట్టిగుంట ప్రాథమికోన్నత పాఠశాల

సంఘమిత్ర నియామకంపై విచారణ గందరగోళం

తంబళ్లపల్లె, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె మండలం కన్నెమడుగు సంఘమిత్రగా సుజన నియామకంపై శనివారం అధికారులు చేపట్టిన విచారణ గందరగోళంగా మారింది. తంబళ్లపల్లె మండలం కన్నెమడుగు సంఘమిత్రగా పనిచేస్తున్న వసంతకుమార్‌రెడ్డి కొన్ని నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన స్థానంలో ఈ ఏడాది ఆగస్టులో అదే గ్రామానికి చెందిన సుజన ఎన్నికై విధులు నిర్వహిస్తోంది. ఈ క్రమంలో నిబంధనలకు విరుద్ధంగా సంఘమిత్రను ఎన్నుకున్నారని, ఆమె నియామకం రద్దు చేయాలని కొద్ది రోజుల క్రితం కన్నెమడుగుకు చెందిన ఓవర్గం మహిళా సభ్యులు రాయచోటిలో కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన చేశారు. సమస్యను పరిష్కరించాలని కలెక్టరు పీడీని ఆదేశించడంతో శనివారం డీపీఎంలు లక్ష్మీప్రసాదరెడ్డి, వేణుమాధవ్, ఏపీఎం గంగాధర్‌లు స్థానిక వెలుగు కార్యాలయంలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా సంఘమిత్రను తొలగించి మరొకరిని నియమించాలని పట్టుబట్టడంతో గందరగోళం ఏర్పడింది. దీంతో డిసెంబరు 3వ తేదీ విచారణ చేసి చర్యలు తీసుకుంటామని అధికారులు చెప్పడంతో పలువురు మహిళా సభ్యులు ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ లోకేష్‌రెడ్డి సిబ్బందితో వచ్చి అనుమతి లేకుండా రోడ్డుపై బైఠాయించడం తగదని, చట్టాన్ని ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా పలువురు వైసీపీ నాయకులు ఆందోళన చేస్తున్న మహిళలకు మద్దతు పలికారు. కాగా ఎంపీడీవో కార్యాలయంలోకి వెళ్తున్న తమను అడ్డగించి అనుచితంగా ప్రవర్తించారని టీడీపీ నాయకులు రెడ్డెప్పరెడ్డి, సురేంద్ర వైసీపీ నాయకులు మదనమోహన్‌రెడ్డి, చౌడేశ్వర, కేఆర్‌మల్‌రెడ్డి, లక్ష్మీరెడ్డిలపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అదేవిధంగా ధర్నాలో పాల్గొని ఉద్యోగాలను దుర్వినియోగం చేసి, తమను అడ్డగించిన అంగన్వాడీలపై కూడా పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఇది రాజకీయ రంగు పులుముకుంది.




ధర్నా చేస్తున్న వారితో మాట్లాడుతున్న ఎస్‌ఐ లోకేష్‌రెడ్డి

ప్రాణాలు తీస్తున్న ఒత్తిడి

- ఆత్మహత్యకు పాల్పడుతున్న వైనం
- ప్రతిరోజూ మానసిక వైద్యుని వద్దకు పదుల సంఖ్యలో విద్యార్థులు
- మార్కులు, ర్యాంకుల లక్ష్యాలే సమస్యలు
- తల్లిదండ్రుల్లో మార్పు రావాలంటున్న వైద్యులు

"మంచి ర్యాంకు కోసం కష్టపడి చదివాను ఈ మధ్య ఎందుకో బాగా చదవలేకపోతున్నా అనిపిస్తుంది. నాన్న చెప్పిన ర్యాంకు వస్తుందో లేదోనని భయం వేస్తోంది. నిద్రపట్టడంలేదు. ఆకలి అనిపించడంలేదు. ఇంట్లో వాళ్లకి చెప్పలేకపోతున్నా. ఏం చేయాలో అర్థం కావడం లేదు"- ఇది వైద్యుని వద్ద ఓ ఇంటర్ విద్యార్థి ఆవేదన. ఇది ఒక్క విద్యార్థి సమస్య మాత్రమే కాదు.. వేలమంది విద్యార్థుల సమస్య. లక్షల్లో ఫీజులు దండుకునే ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలకే కాదు.. అల్లారుముద్దుగా పెంచుకునే తల్లిదండ్రులకూ మార్కులు, ర్యాంకులే లక్ష్యం కావడంతో ఆ ఒత్తిడి అంతా పిల్లలపై పడుతోంది. దీంతో కొందరు ఆత్మహత్యా ప్రయత్నం చేస్తుండగా మరికొందరు డిప్రెషన్‌లోకి వెళ్లిపోతున్నారు. ఇప్పటికైనా విద్యార్థుల తల్లిదండ్రులు మేలుకోవాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు.



కడప ఎడ్యుకేషన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులపై మార్కులు, ర్యాంకులు ఒత్తిడి పెంచుతున్నాయి. దీంతో విద్యార్థులు మానసికంగా ఇబ్బంది పడుతున్నారు. గతంతో పోలిస్తే ఈ తరహా సమస్యలతో బాధపడుతున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. తమ బాధను ఎవరికీ చెప్పుకోలేక కొంతమంది మానసికంగా వేదన అనుభవిస్తున్నారు. డాక్టరు, ఇంజనీరు కావాలి. అందుకను గుణంగా చదివి ర్యాంకు సంపాదించాలి. ఇదే చాలామంది తల్లిదండ్రులు లక్ష్యం. తమ లక్ష్యాన్ని బలవంతంగా పిల్లలపై రుద్దుతున్నారు. కొందరు లక్షలాది రూపాయలు అప్పు చేసి చదివిస్తున్నారు. జాగ్రత్తగా చదువుకో అంటూ మరికొందరు తల్లిదండ్రులు తమకు తెలియకుండానే పిల్లలపై వత్తిడి తీసుకువస్తున్నారు. ఆ బరువు మోసే యత్నంలో శక్తి సరిపోక కొంతమంది బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. తరగతిలో వెనుకబడినా.. మంచి ర్యాంకులు రాకపోయినా తరగతి గదిలో టీచర్లు అవమానకరంగా మాట్లాడినా భరించలేక ఎంతో మంది విద్యార్థులు డిప్రెషన్‌లోకి వెళుతున్నారు. ఒకసారి డిప్రెషన్‌లోకి వెళ్లిన విద్యార్థులు బయటికి రావడం కష్టమని, వారంతా ఈ జీవితం ఎందుకనే భావనతో బతుకుతుంటారని వైద్యులు చెబుతున్నారు.



రెండు ఉదాహరణలు..

- మార్కులు తక్కువ వస్తాయన్న దిగులుతో 2019 ఆగస్టులో కడప ఎన్జీవో కాలనీలో ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి రైలు కింద పడి ప్రాణాలు తీసుకున్నాడు. అయితే అధ్యాపకుల వేధింపుల వల్లనే తమ కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడని బాలుడి తండ్రి అప్పట్లో ఆరోపించారు.
- 2022 మార్చిలో అన్నమయ్య జిల్లా సంబేపల్లె మండలం ఎర్రగుంట్ల గురుకుల పాఠశాలలో పదోతరగతి విద్యార్థిని (15) ఆత్మహత్య చేసుకుంది. హాస్టలు గదిలో విష ద్రావణం తాగి ఆత్మహత్యకు యత్నించగా వెంటనే కడప రిమ్స్‌కు తరలించారు. రిమ్స్‌లో చికిత్స పొందుతూ విద్యార్థిని మృతిచెందింది. సరిగా చదవలేకపోతున్నానంటూ విద్యార్థిని సూసైడ్ నోట్ రాసింది. తమ కుమార్తె కొన్ని సబ్జెక్టులు చదవలేక వెనుకబడి ఉండడం వల్ల ఆత్మహత్యకు పాల్పడినట్లు విద్యార్థిని తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తల్లిదండ్రుల్లో మార్పు రావాలి

విద్యార్థులను చిన్నప్పటి నుంచే హాస్టళ్లలో చేర్పించి చదివించాలని భావించే తల్లిదండ్రులు వారి మానసిక శారీరక పరిస్థితిని అర్థం చేసుకోవాలి. తల్లిదండ్రులు ఎప్పుడూ పిల్లలకు లక్ష్యాలు పెట్టకుండా వారిలో ఉన్న ప్రతిభను గుర్తించి అందుకు అనుగుణంగా ప్రోత్సహించే ప్రయత్నం చేయాలి. అంతేకానీ ముందునుంచే డాక్టరు కావాలి, ఇంజనీరు కావాలి, ఐఏఎస్, ఐపీఎస్ అంటూ లక్ష్యాలు విధించడం ద్వారా ఒత్తిడికి గురయ్యే ప్రమాదం ఉంది. గొప్పగొప్ప స్థానాలకు వెళ్ళిన వారు.. వారి ఇష్టపూర్వకంగా ఆయా రంగాలను ఎంచుకున్న వాళ్లే తప్ప తల్లిదండ్రుల ఒత్తిడితో ఎదిగిన వారు కాదనే విషయం గుర్తుచేసుకోవాలి. ఈ విషయంలో తల్లిదండ్రుల్లో తప్పనిసరిగా మార్పు రావాలని ర్యాంకులు, మార్కుల కోసం పిల్లలపై ఒత్తిడి పెంచవద్దని నిపుణులు చెబుతున్నారు. స్పెషల్ క్లాసులు, ట్యూషన్లు అంటూ ఒత్తిడికి గురిచేస్తే విద్యార్థి మానసిక ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతినే అవకాశం ఉందంటున్నారు. ఇంజనీరింగ్, డాక్టరు మాత్రమే కాదు, ఎన్నో రంగాల్లో అద్భుతమైన అవకాశాలు ఉన్నాయన్న విషయాన్ని తల్లిదండ్రులు గుర్తించాలంటున్నారు. విద్యార్థులు తీవ్రమైన ఒత్తిడికి గురయ్యేలా చేస్తున్నది తల్లిదండ్రులేనని వారిలో మార్పు రావలసిన అవసరం ఉందని వైద్యులు స్పష్టం చేస్తున్నారు.



కౌన్సెలింగ్ కేంద్రాలు ప్రశ్నార్థకం..

ప్రతి కళాశాలలో విద్యార్థులకు కౌన్సెలింగ్ చేసేందుకు అనుగుణంగా కేంద్రాలను ఏర్పాటు చేయాల్సిందిగా కేంద్రం సూచించింది. అయితే ఏ కళాశాలలోనూ ఈ తరహా కేంద్రాలను ఏర్పాటు చేయలేదని చెప్పవచ్చు. ఈ కేంద్రాలు ఉంటే రోజువారి యాక్టివిటీస్‌కు భిన్నంగా ఉండే విద్యార్థులను గుర్తించి కౌన్సెలింగ్ ఇవ్వడం ద్వారా సాధారణ స్థితికి తీసుకువచ్చేందుకు అవకాశం ఉంటుంది.

కౌన్సెలింగ్‌కు వస్తున్న వారిలో విద్యార్థులు ఎక్కువ..



ఈ మధ్యకాలంలో కౌన్సెలింగ్‌కు వస్తున్న వారిలో విద్యార్థులే ఎక్కువగా ఉంటున్నారు. నిద్రపట్టడం లేదని, కన్నుమూస్తే ర్యాంకులు, మార్కులు కనిపిస్తున్నాయని, ఆకలి లేదని, చనిపోవాలనిపిస్తుందంటూ కొంతమంది విద్యార్థులు చెబుతున్నారు. పరీక్షల భయంతో బాధపడుతున్న విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉంటోంది. తల్లిదండ్రుల ఒత్తిడి కారణంగా విద్యార్థులు నలిగిపోవడం వల్లనే ఈ సమస్య ఉత్పన్నమవుతోంది. ఈ సమస్యతో బాధపడుతున్న వారిలో ఎక్కువ మంది విద్యార్థులు డిప్రెషన్‌లోకి జారుతున్నారు. ఇది అత్యంత ప్రమాదకర సంకేతం. ఇందులో చాలామంది ఆత్మహత్యకు కూడా ప్రయత్నిస్తూ ఉంటారు. ముందుగానే గుర్తించి కౌన్సెలింగ్ ఇవ్వడం అవసరం. విద్యార్థులపై తీవ్రమైన ఒత్తిడి పనికిరాదు. ఈ విషయంలో తల్లిదండ్రులు ఆలోచన చేయాలి.

- ప్రొఫెసర్ డాక్టర్ వంశీక్రిష్ణ, మానసిక వైద్యనిపుణుల ఆసుపత్రి, కడప

జిల్లా కేంద్రంలోనే శిక్షణ ఇవ్వాలి

డీఈవోకు ఉపాధ్యాయ సంఘాల వినతి



డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నేతలు

రాయచోటిటౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రధానోపాధ్యాయులకు అందించే లీడర్ షిప్ ట్రైనింగ్‌ను జిల్లా కేంద్రంలోనే నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో నిర్వహించాలని డీఈవో సుబ్రమణ్యంకు శనివారం ఉపాధ్యాయ సంఘాల నేతలు వినతిపత్రాన్ని అందించారు. ఇటీవల పశ్చిమ గోదావరిలో నిర్వహించిన శిక్షణలో ఒక ప్రధానోపాధ్యాయుడు గుండెపోటుతో మరణించారని,మరొకరు ఐసీయూలో అడ్మిట్ అయ్యారని, ఆ సంఘటనలతో రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఇకపైన జిల్లాల వారీ జరుపుతామని హామీ ఇచ్చారని వినతిలో పేర్కొన్నారు. జిల్లాలోని రాయచోటి, మదనపల్లి డివిజనల్ ప్రధానోపాధ్యాయులకు 18వ తేదీ నుంచి అనంతపురం సెంటర్‌లోనే ట్రైనింగ్‌కి హాజరుకావాలని చెబుతున్నారన్నారు. జిల్లాలోని ఏ ఒక్క పాఠశాల కూడా అనంతపురంలో జరిగే ట్రైనింగ్ సెంటర్‌కి వంద కిలోమీటర్ల లోపల లేనందువలన అన్నమయ్య జిల్లాలోని ప్రధానోపాధ్యాయులు అందరికీ ట్రైనింగ్‌ను అన్నమయ్య జిల్లాలోనే ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో నోబెల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర బాధ్యులు శ్రీనివాసరాజు, ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు రామక్రిష్ణ, మడితాటి నరసింహారెడ్డి, జే.వెంకట్రామిరెడ్డి, ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు శివారెడ్డి, రామకృష్ణ, ఏపీటీఎఫ్ 257 జిల్లా అధ్యక్షుడు అబ్బవరం హరిబాబు, అపస్ జిల్లా అధ్యక్షుడు నరసింహులు, ఉపాధ్యాయులు కులశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులు, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు సదాశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొలంలోనే రైతుకు గుండెపోటు

మదనపల్లె అర్బన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పొలానికి ఎరువు బస్తా తీసుకెళుతుండగా గుండెపోటుతో కుప్పకూలిపోయాడు. దీంతో వెంటనే మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించేలోపే రైతు జి.నరసింహులు(45) మృతి చెందాడు. కుటుంబసభ్యుల వివరాల మేరకు తంబళ్లపల్లె మండలం, చౌడసముద్రం గ్రామం, గోవిందువారిపల్లెకు చెందిన నరసింహులు వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు.

శనివారం ఉదయం వ్యవసాయం పొలం వద్ద ఎరువు మోస్తున్న సమయంలో ఛాతీలో నొప్పి రావడంతో అక్కడే కుప్ప కూలిపోయాడు, సమచారం తెలుసుకున్న కుటుంబసభ్యులు 108 వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి చికిత్స కోసం తరలించేలోపే మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. అనంతరం మృతదేహాన్ని గ్రామానికి తరలించారు. ఈయనకు భార్య, జయమ్మ ఉన్నారు. పిల్లలు లేరు.



మృతి చెందిన రైతు నరసింహులు

వీపులో దిగబడిన కత్తి

- మదనపల్లెవాసికి జీహెచ్‌లో శస్త్రచికిత్స

చెన్నై, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా మదనపల్లెకు చెందిన వీరాస్వామి (44) అనే కార్మికుడి వీపులో 15 సెం.మీ.మేర దిగబడిన కత్తిని నగరంలోని రాజీవ్‌గాంధీ ప్రభుత్వ ఆస్పత్రి (జీహెచ్)లో వైద్యులు మూడు గంటలపాటు శస్త్రచికిత్స చేసి తొలగించారు. మూడు రోజుల క్రితం బంధువులతో జరిగిన ఘర్షణల్లో వీరాస్వామి కత్తిపోటుకు గురయ్యారు. వీపులో 15 సెం.మీ. లోతులో కత్తి దిగబడటంతో అక్కడి ఆస్పత్రుల్లో చికిత్స పొందేందుకు ప్రయత్నించారు. ఎక్కడా అతడికి శస్త్రచికిత్స చేసి కత్తిని తొలగించేందుకు వైద్యులు సాహసించలేకపోయారు. చివరకు చెన్నై ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీహెచ్)లో చికిత్స కోసం చేరాడు. వైద్యులు అన్ని పరీక్షలు చేసి మూడు గంటల పాటు శస్త్రచికిత్స జరిపి ఆ కత్తిని తొలగించారు. శనివారం ఈ విషయమై ఆ ఆస్పత్రి డీన్ థెరని రాజన్ మాట్లాడుతూ వీరాస్వామి వీపులో కత్తి దిగబడటం వల్ల అతడిని పడుకోబెట్టి ఆపరేషన్ చేయలేక కూర్చోబెట్టి అనస్తీషియా ఇచ్చి ఆపరేషన్ చేశామన్నారు. డాక్టర్ మారియప్పన్ నాయకత్వంలో ప్రొఫెసర్ డాక్టర్ శివన్‌రాజ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జయప్రకాష్‌తో కూడిన వైద్య బృందం ఈ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించిందని, ప్రస్తుతం అతడు పూర్తిగా కోలుకుని విశ్రాంతి తీసుకుంటున్నాడని ఆయన వివరించారు.

25 నుంచి 108 సిబ్బంది సమ్మె

అధికారులకు సమ్మె నోటీసు అందచేసిన 108 సిబ్బంది



ఎంపీడీవోకు సమ్మె నోటీసు అందజేస్తున్న 108 సిబ్బంది

కలికిరి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఏళ్లు గడుస్తున్నా తమ సమస్యలు పరిష్కారం కావడం లేదని ఈనెల 25 నుంచి సమ్మెలోకి వెళ్లనున్నట్లు 108 అంబులెన్సు సర్వీసుల సిబ్బంది సమ్మె నోటీసులు అందజేశారు. శనివారం స్థానిక ఎంపీడీవో, తహసీల్దారు, పోలీసుస్టేషన్లలో సమ్మె నోటీసులను అందజేశారు. 108 సర్వీసుల అంబులెన్స్ వ్యవస్థలో నిర్వహణ సంస్థలు మారినప్పుడల్లా తమకు రావలసిన గ్రాట్యుటీ, ఎర్న్‌డ్ లీవు పరిహారం, వార్షిక ఇంక్రిమెంట్లు ఇవ్వకుండానే ఆ సంస్థలు వైదొలుగుతున్నాయని నోటీసులో పేర్కొన్నారు.

దీంతో తాము ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి పరిష్కారంగా తమ ఉద్యోగాలను వైద్య ఆరోగ్య శాఖలో విలీనం చేసి 108 సర్వీసులను ప్రభుత్వమే నిర్వహించాలని కోరారు. టీడీపీ పాలనలో 2017లో విడుదల చేసిన 49వ నెంబరు జీవో ఆధారంగా ప్రతి ఉద్యోగికీ ప్రతి నెలా రూ.4 వేల వంతున చెల్లించే వారని గుర్తు చేశారు. వైసీపీ ప్రభుత్వం ఈ జీవోను రద్దు చేసి తమకు తీవ్ర అన్యాయం చేసిందని తెలిపారు. ఈ జీవోను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని అన్ని వైద్య కళాశాలల్లో చేపడుతున్న ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ పోస్టులకు అవసరమైన అర్హతలున్న వారు లేని కారణంగా భర్తీ చేయడం లేదని వెల్లడించారు. 108 సర్వీసుల్లో పనిచేస్తూ అనుభవం గడించిన ఈఎంటీలకు విద్యార్హతలను సడలించి నియామకాలు చేపట్టాలని కోరారు. 108 సర్వీసులు నిర్వహిస్తున్న సంస్థలు ప్రతి నెలా జీతాల చెల్లింపుల్లో తీవ్ర జాప్యం చేస్తున్న కారణంగా తాము కుటుంబాలతో మనుగడ సాగించలేకపోతున్నామని తెలిపారు. ప్రతి నెలా 5వ తేదీలోగా జీతాలు చెల్లించే విధంగా ఒప్పందం చేసుకుని అమలు చేయాలని కోరారు. వైద్య సర్వీసులకు సంబంధించి ఎక్కడా లేని విధంగా 108 సర్వీసుల్లో రోజుకు రెండు షిఫ్టుల వంతున షిఫ్టుకు 12 గంటల చొప్పున ఏకబిగిన పనిచేయిస్తూ తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్నారని ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. అలా కాకుండా వైద్య శాఖలోని అన్ని విభాగాల్లో అమలవుతున్న విధంగానే 108 సర్వీసు సిబ్బందికి కూడా రోజుకు మూడు షిఫ్టుల వంతున షిఫ్టుకు 8 గంటలతో పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సమ్మె నోటీసును అందజేసిన వారిలో కలికిరి 108 సర్వీసు సిబ్బంది ఈఎంటీలు చంద్రబాబు, యల్లమ్మ, పైలెట్‌లు వేణు, వెంకటస్వామి, ఎస్.వి. రమణలున్నారు.

జాతీయ వాలీబాల్ పోటీలకు రెడ్డివారిపల్లి విద్యార్థి

నిమ్మనపల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు నిమ్మనపల్లి మండలం రెడ్డివారిపల్లి జడ్పీ హైస్కూల్‌లో 8వతరగతి చదువుతున్న విద్యార్థి పి.రాజు ఎంపికైనట్లు హెచ్ఎం రమేష్‌బాబు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ త్వరలో వారణాశిలో జరగబోయే జాతీయస్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొంటాడని తెలిపారు. విద్యార్థి ఎంపిక పట్ల పీఈటీ గీతశ్రీ, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

కేసుల పరిష్కారానికి కృషి చేయాలి

● జిల్లా ప్రధాన జడ్జి శ్రీదేవి



పోలీసుల సమీక్షలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన జడ్జి శ్రీదేవి

కడపరూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థల ఆదేశాల మేరకు డిసెంబరు 14న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో అధిక కేసులు పరిష్కారమయ్యేలా పోలీసు శాఖ అధికారులు కృషి చేయాలని జిల్లా ప్రధాన జడ్జి జి.శ్రీదేవి తెలిపారు. జిల్లా కోర్టు ఆవరణంలోని జిల్లా ప్రధాన జడ్జి ఛాంబరులో శనివారం పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ జాతీయ మెగా లోక్ అదాలత్ ప్రయోజనాలు కక్షిదారులకు వివరించి వారి కేసులు రాజీ మార్గంలో పరిష్కరించుకునేలా పోలీసు అధికారులు చూడాలన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో ఒకసారి కేసు పరిష్కారమైతే సుప్రీంకోర్టు తీర్పుతో సమానమని, అప్పీలు కూడా వెళ్లడానికి వీలు పడదన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి బాబాఫకృద్దీన్, పోలీసుశాఖ అధికారులు పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యం దేశానికి సౌభాగ్యం

● డీఎంహెచ్ఓ నాగరాజు

కడప కలెక్టరేట్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పిల్లల ఆరోగ్యం దేశానికి సౌభాగ్యమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు అన్నారు. శనివారం నగరంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో రాష్ట్రీయ బాలల ఆరోగ్య కార్యక్రమాన్ని డీఎం అండ్‌హెచ్ఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో 0-5 ఏళ్ల చిన్నారులతో పాటు 6-15 ఏళ్లలోపు బాల బాలికలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం జరుగుతోందన్నారు. వాటి వివరాలను ఆరోగ్య ప్రగతి రికార్డుల్లో నమోదు చేసి వైద్య చికిత్సలు అందజేస్తామని తెలిపారు. ఆరోగ్య సమస్యలు ఉంటే సీహెచ్‌సీ, డీహెచ్ఏహెచ్, రిమ్స్ ఆసుపత్రులకు రెఫర్ చేయాలని వైద్యులను ఆదేశించారు. ప్రతి గురు, శనివారం రోజుల్లో బాలబాలికలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నామని, ఈ ప్రక్రియ 6 నెలల పాటు జరుగుతోందన్నారు. విద్యార్థిని, విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, రక్తహీనత, చర్మవ్యాధులు, చెవి, దంత సమస్యలపై అవగాహన కల్పించారు. అనంతరం లైబ్రరీ వారోత్సవాల సందర్భంగా లైబ్రరీ రూమును డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ నాగరాజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసరు డాక్టర్ రమేష్, మెడికల్ ఆఫీసరు డాక్టర్ అనూష, ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం మేనేజరు నవీన్, హెల్త్ ఎడ్యుకేటర్ కుమారి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డు అంతేనా..!

● అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా
● పరిహారం కింద వచ్చిన రూ.70 లక్షలు వృథా
● ప్రైవేటు నిర్మాణాలతో అన్యాక్రాంతం
● పట్టించుకోని వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ అధికారులు



జాతీయ రహదారి పక్కనే ఉన్న వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యాలయం

రాయచోటిటౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని మాసాపేటకు సమీపంలో గల వ్యవసాయ మార్కెట్‌యార్డు దిక్కూ, మొక్కూ లేకుండా అధ్వానంగా తయారైంది. ప్రహరీ గోడ లేకపోవడంతో అసాంఘిక కార్యాకలాపాలకు అడ్డాగా తయారైంది. దీనికి తోడు మార్కెట్‌యార్డు ఆవరణలో ప్రైవేటు వ్యక్తులు నిర్మాణాలు చేపట్టడంతో స్థలం అన్యాక్రాంతమవుతోంది. ఇక్కడ ప్రతి బుధవారం పశువుల సంతతో పాటు ఇతర వ్యాపారులు వచ్చి వారి పంటలను విక్రయించుకుంటారు. కాగా యార్డు ఆవరణంలో నిర్మించిన బియ్యం గోడౌన్‌లో ప్రస్తుతం ఈవీఎంలను భద్రపరిచారు. ప్రహరీగోడ లేకపోవడంతో వీటి భద్రతపైనా అనుమానాలు వ్యక్తమవు తున్నాయి. వీటిపై మార్కెటింగ్ శాఖ అధికారులు శ్రద్ధ చూపడం లేదనే విమర్శలున్నాయి.

వ్యవసాయ ఉత్పత్తులకు నోచుకోని యార్డు

పేరుకే వ్యవసాయ మార్కెట్ యార్డు అయినప్పటికీ ఎటువంటి వ్యవసాయ ఉత్పత్తులకు యార్డు నోచుకోవడం లేదు. జిల్లా కేంద్రమైన రాయచోటి చుట్టుపక్కల వ్యవసాయ ఉత్పత్తులైన వేరుశనగతో పాటు పండ్ల తోటల్లో ప్రధానంగా మామిడి, టమోటా తదితర పంటలను రైతులు అధికంగా సాగు చేస్తారు. అయితే ఈ వ్యవసాయ పంటలు ఏవీ కూడా మార్కెట్‌యార్డులో నిల్వ చేసి విక్రయించిన దాఖలాలు లేవు. వ్యవసాయ ఉత్పత్తులు మార్కెట్ యార్డుకు వస్తే ఆదాయం ఆశించిన స్థాయిలో ఉండేది. ఆ దిశగా వ్యవసాయ మార్కెట్ యార్డు అధికారులు కూడా చర్యలు చేపట్టకపోవడంతో చాలా మంది రైతులు పంటలను నిల్వ చేసుకునేందుకు అవకాశం లేక దళారుల ద్వారా వ్యాపారులకు విక్రయించి ఇంటి దారి పడుతున్నారు. ఈ ప్రాంతంలో మామిడి పంట అధికంగా ఉన్నప్పటికీ సీజన్‌లో చాలా మంది రైతులు పట్టణ నడిబొడ్డులోని ఠాణా సమీపంలో ప్రైవేటు వ్యక్తులు ఏర్పాటు చేసిన మామిడికాయల మండీలకు వెళ్లి అక్కడ దళారులు, వ్యాపారులు నిర్ణయించిన ధరలకే పంటలను విక్రయించే పరిస్థితులు నెలకొన్నాయి. దీనికి తోడు దక్షిణకాశీగా పిలవబడే భద్రకాళీ సమేత వీరభద్రాలయానికి సమీపంలో గల కూరగాయల మార్కెట్‌ను పట్టణంలోని కొత్తపేట దిబ్బలబడికి సమీపంలో నూతనంగా నిర్మించిన రైతు బజారులోకి మార్చాలని రూ.ఒక కోటి ఖర్చుతో రైతు బజారు నిర్మించినప్పటికీ అక్కడికి వ్యాపారులు రాకపోవడంతో ఆ రైతుబజార్ నేడు నిరుపయోగంగా మారింది.



మార్కెట్‌యార్డు స్థలంలో ప్రైవేటు వ్యక్తులు చేపట్టిన నిర్మాణాలు

ప్రహరీ గోడ నిర్మాణం ఎప్పుడో...?

జాతీయ రహదారి విస్తరణలో భాగంగా సుమారు ఐదు సంవత్సరాల క్రితం తొలగించిన వ్యవసాయ మార్కెట్‌యార్డు ప్రహరీగోడ నిర్మాణం ఎప్పుడు జరుగుతుందో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. అప్పట్లో జాతీయ రహదారి విస్తరణలో తొలగించిన ప్రహరీగోడ స్థానంలో నూతన ప్రహరీ గోడ నిర్మాణం కోసం ఎన్‌హెచ్ అధికారులు సుమారు రూ.70 లక్షలకు పైగా పరిహారాన్ని చెల్లించారు. ఆ డబ్బుతో ప్రహరీగోడను నిర్మించి బయట వ్యక్తులను యార్డులోకి ప్రవేశించకుండా చూడాల్సిన వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారులు ఆ విధంగా శ్రద్ధ చూపలేదనే విమర్శలున్నాయి. ప్రహరీ గోడ లేని కారణంగా ప్రస్తుతం బయట వ్యక్తులు పగలు, రాత్రి అనే తేడా లేకుండా యార్డులోకి ప్రవేశించి అసాంఘిక కార్యకలాపాలకు వాడుకుంటున్నారు. మార్కెట్‌యార్డు అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపడితే అటు వ్యాపారులతో పాటు ఇటు రాయచోటి ప్రాంతంలోని రైతన్నలకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

టెండర్లు పిలుస్తున్నా రావడం లేదు

- మదన్‌మోహన్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్‌యార్డు సెక్రటరీ, రాయచోటి

నూతన ప్రహరీ గోడ ఏర్పాటు కోసం 2021 సంవత్సరం నుంచి టెండర్లు పిలు స్తున్నా కాంట్రాక్టర్లు ఎవ్వరూ ముందుకు రావడం లేదు. ప్రహరీగోడ నిర్మాణంతో పాటు జాతీయ రహదారి నుంచి బియ్యం గోడౌన్, మార్కెట్ యార్డు కార్యాలయం వరకు సిమెంటు రోడ్డు ఏర్పాటు కోసం రూ.65 లక్షలతో పలుమార్లు టెండర్లు పిలిచాము. 20 ఎకరాలకు పైగా ఉన్న మార్కెట్ యార్డులో గతంలో సర్వే చేయించి కంపచెట్లను, పిచ్చిమొక్కలను తొలగించాం. స్థలం ఎక్కడా అన్యాక్రాంతానికి గురికాలేదు. ప్రహరీగోడ నిర్మాణానికి, సిమెంటు రోడ్డు ఏర్పాటుకు వ్యవసాయ మార్కెట్‌యార్డు ఖాతాలో నిధులు ఉన్నాయి. ఎవరైనా టెండర్లు వేస్తే నిర్మాణాలను పూర్తి చేస్తాం.



వైసీపీ నాయకుల భూకబ్జాపై విచారణ జరిపిస్తాం

● 200 ఎకరాలు కబ్జా చేసిన వైఎస్ కుటుంబం
● ఫారెస్టు భూమి ఆక్రమించిన ఎంపీ అవినాశ్ పీఏ
● తొండూరులో వందల ఎకరాల ప్రభుత్వ భూమి రిజిస్ట్రేషన్
● సెంటు కబ్జా చేసినట్లు చూపిస్తే రాజకీయ సన్యాసం చేస్తా
● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బీటెక్ రవి



మాట్లాడుతున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బీటెక్ రవి

పులివెందులటౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుల భూకబ్జాలపై విచారణ జరిపిస్తామని, వైఎస్ కుటుంబ సభ్యులు 200 ఎకరాలు భూకబ్జా చేశారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మారెడ్డి రవీంద్రనాథరెడ్డి ఆరోపించారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి.. టీడీపీ నేతలు భూకబ్జాలు చేశారంటూ ఆర్డీవోకు ఫిర్యాదు చేయడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. ఒకరిపై ఆరోపణలు చేసే ముందు గతంలో 'మనం ఎటువంటి పరిపాలన అందించాం, మా నాయకులు ఎంత మంది భూములు ఆక్రమించారని' ఎంపీ గుర్తుపెట్టుకుంటే మంచిదని హితవు పలికారు. గత ప్రభుత్వంలో వైఎస్ కుటుంబమే దాదాపు 200 ఎకరాలు భూకబ్జాలకు పాల్పడిందని తెలిపారు. మీ కుటుంబ సభ్యులు తొండూరు మండలంలో దాదాపు 200 ఎకరాల ప్రభుత్వ భూమిని సాగు చేసి భూకబ్జాలకు పాల్పడింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఈ విషయంపై బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. ఎంపీ పీఏ రాఘవరెడ్డి ఎప్పుడు పోలీసులకు అందుబాటులో ఉంటాడని, అటువంటి వ్యక్తి ఇంటికి అర్ధరాత్రి పోలీసులు వెళ్లి ఇబ్బంది పెట్టారని చెప్పిన అదే రాఘవరెడ్డి అంబకపల్లి గ్రామంలో ఫారెస్టు భూమిని కబ్జా చేసి సాగు చేస్తున్నాడని తెలిపారు. వైసీపీ నాయకుడు దేవిరెడ్డి శంకర్‌రెడ్డి దొండ్లవాగు గ్రామంలో దేవిరెడ్డి చైతన్యరెడ్డి పేరుతో 30 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించారని ఆరోపించారు. ఇకపోతే మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ కదిరి రోడ్డులో 15 ఎకరాల డీకేటీ భూమిని ఇప్పటికీ ఆక్రమించుకుని ఉన్నారని తెలిపారు. వీటిని నిరూపించడానికి సిద్ధమా, ఆ భూములు మీవి కావని ఒక మాట చెప్పండి ఇప్పుడే పేదలకు పంచుతామన్నారు. ఇంత దారుణంగా భూకబ్జాలు చేసి ఏమీ ఎరగనట్లు ఎంపీ టీడీపీ నాయకులపై ఫిర్యాదు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఇంతవరకు ప్రభుత్వ భూమి తాను ఆక్రమించినట్లు వైసీపీ నాయకులు నిరూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని సవాల్ విసిరారు. వైసీపీ నాయకులు ప్రజల భూములను కబ్జా చేసి ఉంటే ఆర్డీవోకుకానీ, డీఎస్పీకి కానీ ఫిర్యాదు చేయాలని తప్పకుండా వారికి న్యాయం జరిగేలా చూస్తామని ఆయన అన్నారు. టీడీపీ సభ్యత్వ నమోదు గురించి వైసీపీ నాయకులు మాట్లాడడం అర్థరహితమన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ప్రసాదరెడ్డి, వేంపల్లె మండల నాయకులు తదితర టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పాలస్తీనాపై నరమేధం ఆపాలి



కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న ప్రజాసంఘాలు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పాలస్తీనాపై నరమేధం ఆపాలని, యుద్ధాన్ని వెంటనే విరమించుకోవాలని వీక్షణం పత్రికా ఎడిటర్ ఎన్.వేణుగోపాల్ కోరారు. శనివారం జిల్లా పరిషత్ జడ్పీ సమావేశ మందిరంలో కడప సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో డాక్టర్ వెంగల్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ పాలస్తీనా గాజా ప్రాంతంలో నరమేధం జరుగుతుందని, ఇప్పటి వరకు 43 వేల మంది చంపబడ్డారని, లక్షల మందికి గాయాలయ్యాయన్నారు. అందులో 17 వేల మంది పసిపిల్లలే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లక్షల ఇళ్లు నేలకూలడంతో వేల కోట్ల రూపాయలు ఆస్తినష్టం జరిగిందన్నారు. చరిత్రలో ఎప్పటి నుంచో పాలస్తీనా దేశం ఉందని, అమెరికా బ్రిటన్‌లు చమురు బావుల కోసమే ఇజ్రాయిల్‌ను పాలస్తీనా ప్రజలకు పక్కలో బల్లెంలా వాడుకుంటున్నారన్నారు. ఇదొక రాజకీయ ఆర్థిక యుద్ధమన్నారు. సీపీఎం జిల్లా నాయకుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ ఇజ్రాయిల్ పాలస్తీనాపై చేస్తున్న యుద్ధాన్ని ప్రపంచ శాంతి కాముకులందరూ ఖండిస్తున్నారన్నారు. సీపీఐ నాయకుడు చంద్ర మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలు పాలస్తీనాకు మద్దతిస్తున్నాయని, యుద్ధం మాత్రం ఆగలేదన్నారు. సమావేశం అనంతరం కడప నగరంలోని కోటిరెడ్డి సర్కిల్ వద్ద పాలస్తీనాలో మృతులకు సంతాపంగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి, ఓబుల్‌రెడ్డి, బాబుబాయ్, సుల్తాన్, మైనుద్దీన్, గురప్ప, వరలక్ష్మి, డాక్టర్ వినోదిని, సునీత, కుమారస్వామి, రఘునాథరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, సీపీఐఎం నాయకులు పాల్గొన్నారు.

కడపలో ఏఐఎస్ఎఫ్ విద్యార్థుల భారీ ర్యాలీ



సంఘీభావం తెలుపుతున్న విద్యార్థులు, నాయకులు

కడప సెవెన్‌రోడ్స్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఏఐఎస్ఎఫ్ 20వ జిల్లా మహాసభల సందర్భంగా శనివారం కడప నగరంలోని పలు కూడళ్ల మీదుగా భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.శివశంకర్ అధ్యక్షతన నిర్వహించిన బహిరంగసభలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శివారెడ్డి మాట్లాడారు. పొత్తిళ్లలోనే పిడికిలి బిగించి దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అన్నారు. కేంద్రప్రభుత్వం తీసుకువచ్చిన నూతన జాతీయ విద్యావిధానం వల్ల పేదలకు విద్య అందని ద్రాక్షలా తయారవుతోందన్నారు. ఇప్పటికే రేషనలైజేషన్ పేరుతో దేశవ్యాప్తంగా 60 వేల ప్రభుత్వ పాఠశాలలను హైస్కూల్లో విలీనం చేశారని, దీనివల్ల లక్షలాది మంది విద్యార్థులు విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. సుమారుగా 70 వేల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు జీవో నెం.77 వల్ల ఉన్నత పీజీ విద్యకు దూరమవుతున్నారని, సాంఘిక సంక్షేమ హాస్టల్స్‌కు సొంతభవనాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, పెండింగులో ఉన్న మెస్, కాస్మొటిక్ చార్జీలను విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శివశంకర్, వలరాజు, న్యాయసభ జిల్లా సహాయ కార్యదర్శి లీలాక్రిష్ణ, ఉపాధ్యక్షుడు చంద్రతేజ, పీటర్, వెంకటరెడ్డి, మాజీ విద్యార్థి నాయకులు మద్దిలేటి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పెళ్లి చేసుకుంటానని మోసం చేశాడు

● పోలీసుస్టేషన్‌లో యువతి ఫిర్యాదు

పులివెందులటౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వివాహం చేసుకుంటానని చెప్పి శారీరక సంబంధం పెట్టుకుని, ఆ తరువాత పెళ్లి చేసుకోకుండా మోసం చేశాడని పులివెందుల పట్టణానికి చెందిన ఓ యువతి పులివెందుల అర్బన్ పోలీసుస్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు వద్ద చికెన్ షాపు పెట్టుకుని ఉంటున్న సిరిగేపల్లె మల్లిఖార్జున కుమారుడు యశ్వంత్ తనను ప్రేమిస్తున్నానని గత మూడేళ్లగా వెంటపడుతున్నాడని, పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి శారీరకంగా వాడుకున్నట్లు ఆరోపించారు. ఇప్పుడు పెళ్లి చేసుకోమంటే 'మాదిగ కులానికి చెందిన నిన్ను ఎలా పెళ్లి చేసుకుంటాను' అని దుర్భాషలాడుతున్నాడని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు క్రైం నెం.413/2024 కేసులో 69 బీఎంఎస్, ఎస్సీ, ఎస్టీ కేసులు సంబంధించి పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

గోపవరం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): బద్వేలు- నెల్లూరు ప్రధాన రహదారిలో అటవీ లోతట్టు ప్రాంతంలో ఆకస్మిక తనిఖీలు చేయగా రూ.77 వేలు విలువ చేసే పది ఎర్రచందనం దుంగలతో పాటు ముగ్గురు స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్నామని బద్వేలు ఎఫ్ఆర్ఓ నయీం ఆలీ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ డీఎఫ్‌వో వినీత్ కుమార్, ఐఎఫ్ఎస్ సబ్ డీఎఫ్‌వో స్వామివివేకానంద ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. కడప-నెల్లూరు జిల్లా సరిహద్దు ప్రాంతమైన లారీ బాటకు వెళ్లే ప్రదేశంలో అక్రమ రవాణా జరుగుతుందని వచ్చిన సమాచారం మేరకు దాడులు చేయగా ముగ్గురు స్మగ్లర్లతో పాటు పది ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకొని ఒక మోటరు బైకును సీజ్ చేశామన్నారు. కార్యక్రమంలో బీవైఆర్‌వో శేషయ్య, ఎఫ్‌హెచ్‌వో ఖాజవలి, ఎఫ్‌డీవో సువర్ణకుమార్, ఎఫ్‌బీవో రాజేశ్‌రెడ్డి, పుష్పరాజ్ పాల్గొన్నారు.

విద్యుత్తు షాక్‌తో బాలుడి మృతి

సీకెదిన్నె, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యుత్తు షాక్‌కు గురై దుద్యాల వరమోక్షిత్ (8) శనివారం మృతిచెందినట్లు సీకేదిన్నె పోలీసులు తెలిపారు. ప్రొద్దుటూరు కుమ్మరకొట్టాలు గ్రామానికి చెందిన వరుణ్‌కుమార్, కడపలోని ఓ ప్రైవేటు స్కూల్ హాస్టల్ విద్యార్థుల బట్టలు ఉతికే కాంట్రాక్టు తీసుకుని ఇక్కడే ఉండేవాడు. అతని కుమారుడు వరమోక్షిత్ శనివారం తండ్రివద్దకు వచ్చాడు. ఈ నేపథ్యంలో స్నానం చేసేందుకు బకెట్‌లో ఉంచిన వాటర్‌హీటర్‌ను ప్రమాదవశాత్తు తగిలి స్పృహ కోల్పోయాడు. బాలున్ని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడని, కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మల్లయ్యకొండపై కార్తీక దీపోత్సవం



తంబళ్లపల్లె, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మల్లయ్యకొండపై కార్తీక దీపోత్సవం వైభవంగా నిర్వహించారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు మల్లయ్య కొండకు చేరుకుని స్వామి వారికి పూజలు నిర్వహించారు. శుక్రవారం రాత్రి ఆలయ అర్చకుడు ఈశ్వరప్ప స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయం ఎదుట ధ్వజ స్తంభంపై అఖండ దీపం వెలిగించారు. మహిళలు భక్తి శ్రద్ధలతో ఆలయం ఎదుట దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

అయ్యప్ప ఆలయంలో మండల పూజలు ప్రారంభం



అయ్యప్పస్వామి ఆలయంలో భక్తులకు అన్నదానం చేస్తున్న ఆలయకమిటీ సభ్యులు

మదనపల్లె అర్బన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక చిప్పిలి అయ్యప్ప స్వామి ఆలయంలో మండల పూజలు ప్రారంభమయ్యాయని ఆలయకమిటీ సభ్యులు పేర్కొన్నారు. శనివారం ఉదయం ఆల యంలో గణపతి హోమం, ధ్వజారోహణ, అయ్యప్ప మాల దారులకు అన్నదానం కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. నవంబరు 16 నుంచి జనవరి 15 వరకు నిత్యం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తునట్లు తెలిపారు. అలాగే డిసెంబరు 4న ఆలయంలో అయ్యప్ప పడిపూజ మహోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పడిపూజ కమిటీ, గ్రామోత్సవ కమిటీ, అన్నదాన కమిటీ సభ్యులు జర్మనీరాజు, శివమూర్తి, హేమంత్, బాలకృష్ణ, బాలస్వామి, కేశవ, భగవాన్, విజయలక్ష్మీ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

150 క్వింటాళ్ల వేరుశనగ విత్తన కాయలు మంజూరు



రబీ వేరుశనగకాయలను రైతులకు పంపిణీ చేస్తున్న ఏవో ప్రేమలత

పెద్దతిప్పసముద్రం నవంబర్ 16 ('ఆంధ్రజ్యోతి) : మండలంలోని రైతులకు రబీ సీజన్‌కు సంబంధించి ప్రస్తుతం 150 క్వింటాళ్లు వేరుశనగ కాయలు మంజూరయ్యాయని వ్యవసాయాధికారిణి ప్రేమలత తెలిపారు. ఇంక అవసరమైన మేరకు కావాల్సిన వేరుశనగ కాయలను రైతులకు తెప్పించి ఇస్తామని ఆమె తెలిపారు. శనివారం మండల వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయాధికారిణి ప్రేమలత టీడీపీ నాయకులతో కలిసి రైతులకు వేరుశనగ విత్తన కాయలను పంపిణీ చేశారు. మం డలంలోని వివిధ గ్రామాల్లో వ్యవసాయ ఆధారిత పంటలను బోర్ల కింద సాగు చేసే రైతులకు ప్రభుత్వం అందించే సబ్సిడీ వేరుశనగ కాయలను అందించారు. ప్రభుత్వం ద్వారా రూ.2880 ఉన్న వేరుశనగ కాయలను ప్రభుత్వం రూ.1726లకు సబ్సిడీ రూపంలో అందిస్తున్నట్లు ఆమె తెలిపారు.

ముంచేస్తున్న వర్షం

- పొలంలో దెబ్బతిన్న టమోటా ● తగ్గిన దిగుబడి ● ధరల్లేక రైతన్నల పాట్లు

బి.కొత్తకోట, నవంబరు 16(ఆంధ్రజ్యోతి):వారం, పది రోజులుగా కురుస్తున్న వర్షాలు టమో టా రైతులను నిలువునా ముంచేస్తున్నాయి. తేమ తో పంటకు తెగుళ్ల సోకి మొక్కదశలో ఉన్న పంట నుంచి, కాయలు కోత పడుతున్న పంట వరకు అన్నిస్థాయిలలోనూ దెబ్బతింటుండటంతో రైతులు తీవ్రంగా కలతచెందుతున్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గ పరిధిలోని బి.కొత్తకోట, తంబళ్లపల్లె, పెద్దమండ్యం, కురబలకోట, ములకలచెరువు, పెద్దతిప్పసముద్రం మండలాల్లో సుమారు 15 వేల ఎకరాల్లో టమోటా పంటను సాగుచేస్తారు. అయితే వర్షాల ప్రభావంతో పంటబాగా దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఒక ఎకరా టమోటా సాగుచేయాలంటే రూ1.50 నుంచి రెండు లక్షల దాకా ఖర్చు చేయాల్సి రావడంతో పెట్టుబడి వచ్చే దాకా బిక్కుబిక్కు మంటూ కాలం వెళ్లదీయాలంటున్నారు. ఒకసారి డ్రిప్ ఎరువు, స్ప్రేయింగ్‌కు రూ.10 వేలు పెట్టినా వాతావరణం అనుకూలించకపోతే టమోటా పంటను ఎవరూ కాపాడలేరన్నారు. పూతదశలో పూతరాలిపోవడం, పిందె కాయలుపట్టే దశలో ఉంటే నల్ల మచ్చ, గజ్జి రావడంతో కాయలు పనికిరాకుండా పోతాయంటు న్నారు. తేమ ఆరకుండా తుంపరలు పడితే అప్పటిదాకా పచ్చగా ఉన్న ఆకు నల్లగా మాడిపోయి చెట్టు అవసానదశకు చేరుకుంటోందన్నారు. ఆకంతా రాలిపోయి దిగుబడి తగ్గి పోతోందని చెట్లలో మిగిలిన కాయలు సైతం నాణ్యత తగ్గి మార్కెట్‌లో తక్కువ ధర పలకడంతో తీవ్ర నష్టం వాటిల్లుతున్నట్లు రైతులు వాపోతున్నారు. మిగతా పంటల కంటే ఈ ముసురు టమోటా పంటపాలిట శాపంగా మారిందని రైతులు ఆందోళన చెందుతున్నారు.



బి.కొత్తకోటలో మగ్గిపోయిన టమోటా తోట

వర్షాలతో టమోటా పంటకు తీవ్రనష్టమే..

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో టమోటా పంట ఏదశలో ఉన్నా తీవ్రనష్టమే. తంబళ్లపల్లె నియోజకవర్గ పరిధిలో సుమారు 4వేల ఎకరాల్లో టమోటా పంట సాగుచేశారు. ఇందులో బి.కొత్తకోట మండలంలోనే 900 ఎకరాల్లో పంటసాగైంది. ఇప్పుడు పంటను కాపాడడం అంత సులభంకాకపోయిన రైతులను అవగాహన పరచి ఉన్న పంటను రక్షించుకోవడానికి చర్యలు తీసుకుంటాం. ప్రకృతి నష్టాలను ఎవ్వరూ ఏమి చేయలేరు.

-చంద్రశేఖర్, ఏవో, బి.కొత్తకోట

చిత్రం చెప్పిన సమస్య



ములకలచెరు వు మండలం నాయనిచెరువుపల్లె పంచాయతీ మిట్టసానిపల్లె వద్ద కర్రపైన విద్యుత్ తీగలు వెళుతున్నాయి. ములకల చెరువు - పెద్దతిప్పసముద్రం మండలాల సరిహద్దులో ఉన్న ఈ గ్రామం మీదుగా వెళ్లే రోడ్డు మార్గంలో 11 కేవీ విద్యుత్ తీగలు కర్రపై వెళుతుండడం గమనార్హం. ఏ క్షణమైనా కర్ర పడిపోతే ప్రమాదం పొంచి ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ దృశ్యాలు అధికారులకు కనిపించకపోవడం శోచనీయం. ఇప్పటికైనా ట్రాన్స్‌కో అధికారులు స్పందించాల్సి ఉంది.

-ములకలచెరువు, (ఆంధ్రజ్యోతి)

రామ్మూర్తి మరణం టీడీపీకి తీరనిలోటు

మదనపల్లె టౌన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు సోదరుడు, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తినాయుడు మరణం టీడీపీకి తీరని లోటని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, టీడీపీ పరిశీలకుడు శివరామ్ ప్రతాప్, ఆర్‌కే రామకృష్ణాచారి ఒక ప్రకటనలో సంతాపం తెలియజేశారు. చంద్రగిరిలో చంద్రబాబు తరువాత తనకంటూ గుర్తింపు పొందిన రామ్మూర్తినాయుడు అనారోగ్యంతో మృతి చెందడం బాధాకరమని టీడీపీ మున్సిపల్ కౌన్సిలర్ తులసీ తెలిపారు.

మద్యం స్వాధీనం..నిందితుడు అరెస్టు

ములకలచెరువు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ములకలచెరువు ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని పెద్దమండ్యం మండలంలో శనివారం రాయచోటి ఈఎస్‌టీఎఫ్‌తో కలిసి దాడులు నిర్వహించి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని నిందితుడ్ని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ మాధవి తెలిపారు. వెలిగల్లు బస్‌స్టాపు సమీపంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న కొత్తవాండ్లపల్లెకు చెందిన క్రిష్ణమూర్తి(59)ని అరెస్టు చేసి అతని వద్దనుంచి 20 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

మదనపల్లె అర్బన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి):స్కూటర్ ప్రమాదంలో పెద్దన్న (62) అనే వ్యక్తికి కాలువిరిగిన సంఘటన మదనపల్లె పట్టణం కాట్లాటపల్లె రోడ్డులో శనివారం జరిగింది. ఇంటి వద్ద నుంచి అంగడికి వెళ్లి వస్తున్న పెద్దన్నను అటుగా వెళుతున్న స్కూటర్ ఢీ కొట్టడంతో కాలు విరిగి అక్కడే పడిపోయాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బాల్య వివాహాలను నివారించాలి

పెద్దమండ్యం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి) సమష్టి కృషితో బాల్యవివాహాలను నివారించాలని తంబళ్లపల్లి ఫోర్డు సంస్థ మండల కోఆర్డినేటర్ ఆవుల నరసింహులు పిలుపు నిచ్చారు. బాలల పరిరక్షణ వారోత్సవాల సందర్భంగా మండలంలోని పెద్దమండ్యం, బండ్రేవు, కలిచెర్ల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులల్లో చైతన్యకార్యక్రమాలు నిర్వహించారు. తన స్వంత నిధులతో అంగన్‌వాడీ కేంద్రాలలోని చిన్నారులకు విద్యా సామగ్రి అందించారు. ఎంఈవో మనోహర్, ప్రిన్సిపాల్ రామాంజులునాయక్, సిబ్బంది రెడ్డమ్మ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరు

పెద్దమండ్యం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి) గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వం తగిన మేర నిధులు మంజూరు చేస్తోందని పెద్దమండ్యం ఎంపీడీవో శ్రీధర్‌రావు పేర్కొన్నారు. శనివారం మండలం లోని దిగువపల్లిలో సర్పంచ్ బండి వాసవి అధ్వర్యంలో సీసీ రోడ్లు పనులను ఎంపీడీవో ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దిగువపల్లిలో సీసీ రోడ్ల కు రూ.8 లక్షలు నిధులు మంజూరైనట్లు తెలిపారు. కూటమి నేతలు బండి యుగంధర్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు సాధనకై పోరాటం



మార్కెట్టు యార్డు ఎదురుగా నిరసన తెలియజేస్తున్న ఆటో డ్రైవర్లు

మదనపల్లె అర్బన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడానికి ఐక్యంగా పోరాడుదామని, జీవో 21,31 రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. శనివారం విజయవాడలో నిర్వహించిన ఏపీ ఆటో డ్రైవర్ల ధర్నాకు సం ఘీభావంగా మదనపల్లెలోని మార్కెట్ యార్డు ఎదురుగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సాంబశివ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆటో డ్రైవర్లకు ఈపీఎఫ్, ఈఎస్‌ఐ పెన్షన్‌తో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. మోటర్ వాహనాలపై భారీ జరిమానాలను విధించే జీవో 21.31లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి తిరుమల, ఆటోవర్కర్స్ యూనియన్ నాయకులు రెడ్డెప్ప, మురళి, కరీముల్లా, రవి, జహంగార్, వెంకటేస్, రెడ్డి, సయ్యద్‌లు పాల్గొన్నారు.

ప్రజల అభీష్టం మేరకు అభివృద్ధి పనులు గుర్తించాలి



మాట్లాడుతున్న డీఎల్‌డీవో అమరనాథరెడ్డి

మదనపల్లె టౌన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సభలు నిర్వహించి ప్రజల అభీష్టం మేరకు అభివృద్ధి పనులను గుర్తించాలని డీఎల్‌డీవో అమరనాథరెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో జీపీడీపీపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎల్‌డీవో మాట్లాడుతూ 2025-26 సంవత్సరంలో గ్రామాల్లో చేపట్టబోయే మౌలిక సదుపాయాలు, అభివృద్ధి పనులను గుర్తించే బాధ్యత సర్పంచ్‌లు, అధికారులదే అన్నారు. సమావేశంలో ఎంపీడీవో తాజ్‌మస్రూర్, టీఓ టీలు షఫ్రుద్దీన్, భానుమూర్తి, గిరిధర్‌నాయక్, సర్పంచ్ దీప, కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధిపై దృష్టిసారించండి



సమావేశంలో మాట్లాడుతున్న రాయచోటి డీఎల్‌డీవో లక్ష్మీపతి

గుర్రంకొండ/ కలకడ, నవంబరు 16(ఆంధ్రజ్యోతి):గ్రామ పంచాయతీలు అభివృద్ధి చెందడానికి అధికారులు కృషి చేయాలని రాయచోటి డీఎల్‌డీవో లక్ష్మీపతి పేర్కొన్నారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీలను బలోపేతం చేయడానికి ప్రభుత్వం నిధులను మంజూరు చేయనుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవోలు వెంకటేశులు, అబ్దుల్ రహీం, ఈవోఆర్డీ బ్రహ్మానందరెడ్డి, వెంకటసుబ్బయ్య, ఏవో నాగశివారెడ్డి, కార్యదర్శులు, వెలుగు సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాభాగస్వామ్యంతో ప్రణాళికలు రూపొందించాలి

పీలేరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి ప్రజల భాగస్వామ్యంతో సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని మదనపల్లె డీఎల్‌పీవో నాగరాజు తెలిపారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక(జీపీడీపీ)పై పీలేరు మండలంలోని అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల లీడర్లకు శనివారం ఒకరోజు శిక్షణ జరిగింది. ఈ సందర్భంగా డీఎల్‌పీవో నాగరాజు మాట్లాడుతూ శిక్షణలో తెలిపిన అంశాలను అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ప్రణాళికలను చేసి ఉన్నతాధికారులకు పంపాలన్నారు. కార్యక్ర మంలో ఎంపీడీవో శివశంకర్, వైస్‌ఎంపీపీ ఎస్వీ చలపతి, ఈవోపీఆర్‌ఆర్‌డీ లతీఫ్ ఖాన్, పాల్గొన్నారు.

శిక్షణా తరగతులకు ప్రజాప్రతినిధుల డుమ్మా ..

బికొత్తకోట, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల ప్రజాప్రతినిధులు, అధికారులకు నిర్వహించిన ఒక రోజు శిక్షణాతరగతులకు ప్రజాప్రతనిధులు డుమ్మా కొట్టారు. బి.కొత్తకోట మండలంలో 15మంది సర్పంచులు ఉండగా ఇద్దరు, 11 మంది ఎంపీటీసీలు ఉండగా కేవలం ఒకరు మాత్రమే ఈ తరగతులకు హాజరయ్యారు. ఇందుకు మండల గ్రాంటు నిధులు రూ.90లక్షలకు తాము చేసిన పనులకు బిల్లులు పెట్టడంలేదని, ఎంపీటీసీలు డుమ్మాకొట్టారని తెలిసింది. కాగా తమ పంచాయతీలకు 15వ ఆర్థికసంఘం నిధులు మంజూరైనప్పటికీ పాతపనులకు నిధులు వినియోగించకూడదని చెప్పడం సబబు కాదని సర్పంచులు హాజరు కాలేదని తెలిసింది. దీంతో చేసేదిలేక హాజరైన ఒకరిద్దరు సభ్యులతోనే సమావేశాన్ని మమ అనిపించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శంకరయ్య పలువురు మండల అధికారులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

మదనపల్లె టౌన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మదనపల్లె కోర్టులో డిసెంబరు 14వ తేదీ నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరనాయక్ పేర్కొన్నారు. శనివారం స్థానిక కోర్టుహాల్లో పోలీసు అధికారులు, న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో దీర్ఘకాలంగా ఉన్న సివిల్, క్రిమినల్, రోడ్డు ప్రమాద కేసులను ఇరు వర్గాల అంగీకారంతో ం పరిష్కరించు కోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి విజయకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

మదనపల్లెలో వర్షం.. లోతట్టు ప్రాంతాలు జలమయం



మదనపల్లె అర్బన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి):మదనపల్లె పట్టణంలో శనివారం సాయంత్రం గంట పాటు వర్షం కురిసింది. దీం తో లోతట్టు ప్రాంతాల్లో వర్షం నీరు చేరి ప్రజలు, వాహనదారులు, చాలా ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా బెంగళూరు బస్టాండ్‌లో వర్షం నీరు. మురుగుకాలువల నీరు చేరడంతో చెరువును తలపించింది. గాంధీరోడ్డు నీటి మడుగులా తయారైంది. వర్షంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. పట్టణంలోని బుగ్గకాలువ వంక, బహుదావంక సాగింది. లోతట్టు ప్రాంతాల్లో వర్షం నీరు నిలిచింది.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీనివాసులు

మదనపల్లె అర్బన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తన ప్రియరాలు పరువుతీసిందని యువకుడు విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు మదనపల్లె జిల్లా ఆస్పత్రి అవుట్ పోస్ట్ పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు... మదనపల్లె మండలం కొండామర్రిపల్లె గ్రామం ఇసుకనూతనపల్లెకు చెందిన మునెప్ప కుమారుడు బి.శ్రీనివాసులు (40) వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే మదనపల్లె మండలం కురవంకకు చెందిన ఓ మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని ఆమె వద్ద కొంత నగదు తీసుకున్నాడు, రెండు నెలలుగా ఆమె ఇంటికి వెళ్లలేదు. దీంతో ఆమె శుక్రవారం ఇంటి వద్దకు వచ్చి తన పరువు తీసిందన్న మనస్థాపంతో శనివారం విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు అతడిని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఏఐఎస్‌ఎఫ్ మహాసభలను జయప్రదం చేయండి

మదనపల్లె టౌన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): విజయనగరంలో ఈనెల 27వ తేదీ నిర్వహించనున్న ఏఐఎస్‌ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవ్ పిలుపునిచ్చారు. శనివారం మదనపల్లెలో ఏఐఎస్‌ఎఫ్ మహాసభలను పోస్టర్లను ఆవిష్కరించారు. ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాలతో విద్యావ్యవస్థ కుంటుపడుతోందన్నారు. ఇలాంటి అంశాలపై చర్చించడానికి ఈ మహాసభలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు ఆర్‌వీ రమణ, పోకల మధుసూధన్, రాజగోపాల్, ఏఐఎస్‌ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

నీటిపారుదల సమస్యలు పరిష్కరించండి

- మంత్రి నిమ్మలరామానాయుడుకు టీడీపీ నేత జయచంద్రారెడ్డి వినతి



ఇరిగేషన్ మంత్రిని కలిసిన జయచంద్రారెడ్డి మరో మంత్రి మండిపల్లి

ములకలచెరువు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె నియోజకవర్గంలో నెలకొన్న తాగునీటి పారుదల శాఖా పరిధిలోని సమస్యలను తక్షణం పరిష్కరించాలని టీడీపీ నేత దాసరపల్లి జయ చంద్రారెడ్డి ఆ శాఖ మంత్రి నిమ్మలరామానాయుడును కోరారు. అమరావతిలోని క్యాంపు కార్యాయంలో శనివారం జిల్లా మంత్రి మండ్లిపల్లి రాంప్రసాద్ రెడ్డి తో కలిసి ఇరిగేషన్ మంత్రిని కలిశారు. ఈ సంద ర్భంగా నియోజవర్గంలో హంద్రీ-నీవా కాలువ, పెద్ద చెరువుల పరిస్థితిని మంత్రికి వివరించారు. హంద్రీ - నీవా జలాలతో అన్ని చెరువులు నింపి నియోజక వర్గాన్ని సస్యశ్యామలం చేయాలని కోరారు. ఇందుకు గానూ నిధులు కేటాయించి పనులు చేపట్టాలని కోరారు.

మంత్రి నాదెండ్లను కలిసిన జనసేన నాయకులు



మంత్రి నాదెండ్ల మనోహర్‌తో జనసేన నాయకులు

పీలేరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి, జనసేన పీఏసీ అధ్యక్షుడు నాదెండ్ల మనోహర్‌ను శనివారం ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పలువురు జనసేన నాయకులు కలిశారు. పీలేరు జనసేన పార్టీ ఇన్‌ఛార్జ్ బెజవాడ దినేశ్, పుంగనూరు ఇన్‌ఛార్జ్ చిన్నా రాయల్, తంబళ్లపల్లె ఇన్‌ఛార్జ్ సాయినాథ్‌లు మంత్రిని సచివాలయంలో కలిశారు. ఈ సందర్భంగా తమ నియోజకవర్గాల్లో జనసేన బలోపేతంపై చర్చించినట్లు బెజవాడ దినేశ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పీలేరు జనసేన నాయకులు రెడ్డప్ప, మున్నా, తదితరులు పాల్గొన్నారు.

నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు

- ఓవర్ లోడు ఫీడర్లను ఫైబరికేషన్ చేయండి ● డీఈ గంగాధరం



కన్నెమడుగు విద్యుత్ ఉపకేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఈ, ఆ శాఖ అధికారులు

తంబళ్లపల్లె, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు విద్యుత్ శాఖ డీఈ గంగాధరం పేర్కొన్నారు. శనివారం ఆయన ఏడీ గోవిందరెడ్డితో కలసి కన్నెమడుగు, గోపిదిన్నె 33/11 కేవి విద్యుత్ ఉపకేంద్రాలను తనిఖీ చేసి ఈ రెండు ఉపకేంద్రాలలో నూతనంగా ఏర్పాటు చేయనున్న 5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ పనులను పరిశీ లించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ..విద్యుత్ ఉపకేంద్రాలలో ఓవర్ లోడు ఉన్న ఫీడర్లను ఫైబరికేషన్(అదనంగా మరో విద్యుత్ లైను) చేయాలని ఇరవై సంవత్సరాలు పై బడిన రేణుమాకులపల్లె, మర్రిమాకులపల్లె, తంబళ్లపల్లె రూరల్ బ్రేకర్లను తీసివేసి నూతన బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనంతరం తంబళ్లపల్లె విద్యుత్ ఉపకేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన కెపాసిటర్ బ్యాంకును పరిశీలించారు. సోమవారం ఎస్‌ఈ చేతుల మీదుగా కెపాసిటర్ బ్యాంకుతో పాటు 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఏఈ శేషుకుమార్, ఎల్ఐ భాస్కర్, లైన్‌మన్లు శంకర, ప్రభాకర్‌రెడ్డి, శేషు, ఖాజాపీర్ తదితరులు ఉన్నారు.

పేద విద్యార్థినికి టీడీపీ నేత ఆర్థిక సాయం



ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న టీడీపీ నేత దొరస్వామినాయుడు, మిత్రులు

ములకలచెరువు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల గురుకుల పాఠశాలకు చెందిన పేద విద్యార్థినికి టీఎన్‌ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత కట్టా దొరస్వామినాయుడు, ఆయన మిత్రులు ఆర్థిక సహాయం అందజేశారు. పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని రేఖ ఇటీవల జరిగిన త్రైక్వాండో జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చూపింది. ఈ మేరకు వచ్చే నెలలో కలకత్తాలో జరగనున్న అంతర్జాతీయ సెలక్షన్స్‌కు వెళ్లాల్సి ఉండగా ఆర్థిక స్తోమత లేక వాటికి వెళ్లకూడదని నిర్ణయించుకుంది. విషయం తెలుసుకున్న టీడీపీ నేత కట్టా దొరస్వామినాయుడు, ఆయన మిత్రులు జయచంద్రారెడ్డి, రెడ్డి వరప్రసాద్‌లు శనివారం పాఠశాలకు వచ్చి విద్యార్థికి రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. అంతర్జాతీయ సెలక్షన్స్‌కు వెళ్లేం దుకు అయ్యే ఖర్చు మొత్తం భరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కేబీఎన్ టమోటా మండీ యజమాని కట్టా విజయ్‌నాయుడు, పీఈటీ రేష్మా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

108 ఉద్యోగుల సమ్మె సైరన్



ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న 108 ఉద్యోగులు

రామసముద్రం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని లేని పక్షంలో ఈ నెల 25 నుంచి ప్రత్యక్ష సమ్మె చేపడతామని రామసముద్రం మండల 108 ఉద్యోగులు శనివారం స్థానిక ఎంపీడీవో భానుప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ 108 ఉద్యోగులకు ప్రతినెలా ప్రభుత్వమే జీతాలు చెల్లించాలని, రోజువారీ 12గంటల పనిని 8గంటలకు తగ్గించాలని, ఇప్పటివరకు రావాల్సిన ఇంక్రిమెంట్లు, నెలవు వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర 108 నాయకుల పిలుపు మేరకు ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో మండల 108 ఉద్యోగులు శ్రీకాంత్, ప్రసాద్, వెంకటరమణ, పాల్గొన్నాలు